
ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 15-08-2025 (వారం) శుక్రవారం
హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




# కశ్మీరులో వరద కల్లోలం

- 200 మందికి పైగా గల్లంతు!
- మృతుల్లో ఇద్దరు సీఐఎస్ఎఫ్ జవాన్లు
- కిష్త్వార్ జిల్లాలోని చోసితి గ్రామంలో ఘటన
- మాచైల్ మాతా యాత్రికులకిది బేస్‌పాయింట్
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- వరదల్లో కొట్టుకుపోయిన భక్తుల టెంట్లు, షాపులు
- 120 మందిని కాపాడిన సహాయక సిబ్బంది
- గాయపడ్డవారిలో 28 మంది పరిస్థితి విషమం
- ఘటన అత్యంత బాధాకరం: రాష్ట్రపతి, ప్రధాని
- మెరుపు వరదలకు 46 మంది మృతి!



జమ్ము, ఆగస్టు 14: జమ్మూకశ్మీరులో మేఘవిస్ఫోటం (క్లౌడ్ బర్స్ట)తో భారీగా ప్రాణ నష్టం సంభవించింది. కిష్త్వార్ జిల్లాలోని మారుమూల గ్రామం చోసితిలో గురువారం హఠాత్తుగా మేఘవిస్ఫోటం జరగడంతో మెరుపు వరదలు వచ్చాయి. మాచైల్ మాత ఆలయానికి వెళ్లే యాత్రికులకు ఈ గ్రామమే బేస్ పాయింట్. ఇక్కడ యాత్రికుల కోసం లంగర్ (సామూహిక వంటశాలలు) ఏర్పాటు చేస్తారు. భక్తులు ఇక్కడే వాహనాలు వదిలి, కాలినడకన మాచైల్ మాత గుడికి వెళ్తారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మెరుపు వరదలు రావడంతో భక్తుల టెంట్లు, దుకాణాలు, వసతి సౌకర్యాలు, సెక్యూరిటీ అవుట్ పోస్టులన్నీ కొట్టుకుపోయాయి. ఈ విషాద ఘటనలో 46 మంది మరణించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. శిథిలాలు, బురద కింద మరింత మంది చిక్కుకొని ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టి 167 మందిని కాపాడగా.. వారిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. 200 మందికి పైగా గల్లంతైనట్లు భావిస్తున్నారు. మృతుల్లో ఇద్దరు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారని చెప్పారు. ఘటనా స్థలంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు, ఆర్మీ, స్థానిక వాలంటీర్లు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

తరువాయి 2లో

# స్థానికంపై తేలేది పీఏసీలోనే

- ఈ నెల 20 తర్వాత సమావేశం
- మెజార్టీ నేతల అభిప్రాయాల మేరకే తుది నిర్ణయం



ఈ కబురు , హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహిస్తారనేది రాష్ట్ర కాంగ్రెస్ 'రాజకీయ వ్యవహారాల కమిటీ'(పీఏసీ) సమావేశంలో తేలనుంది. ఈ నెల 16 లేదా 17వ తేదీన ఈ సమావేశం నిర్వహించాలని తొలుత అనుకున్నా వర్షా లు, ఇతర కార్యక్రమాల కారణంగా ఆలస్యమవుతున్నట్లు సమాచారం.

» 2లో

# ఉగ్రవాదంపై మానవత్వ పోరాటం: ద్రౌపది ముర్ము

-ఆపరేషన్ సిందూర్ ఆ విధంగానే చరిత్రలో నిలిచిపోతుంది

-స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన ముర్ము



» 2లో

# ఓక్రిడ్జ్ స్కూల్ పార్కింగ్ అరాచకం

- ప్రధాన రహదారిని ఆక్రమించి వాహనాల పార్కింగ్
- కార్ల పార్కింగ్ కోసం రోడ్డు మూసివేత
- ట్రాఫిక్ రద్దీతో వాహనదారుల ఇబ్బందులు
- స్పందించిన జీహెచ్ఎంసీ నోటీసులు జారీ

ఈకబురు, శేరిలింగంపల్లి: "అందులో చదివేదంతా అమాత్యుల పిల్లలే... రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేల పిల్లలు మొదలుకొని ఉన్నతాధికారులు, సినీ స్టార్లు, బిజినెస్ మ్యాన్ ల పిల్లలు సైతం ఎంతోమంది ఇదే స్కూల్లో చదువుతున్నారు. లక్షలకు లక్షలు డొనేషన్లు, ఫీజులు తీసుకొని చదువుచెప్పే ఇంటర్నేషనల్ స్కూల్ అది. అసలే ఎంతో పలుకుబడి ఉన్న ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్... ఆపై అమాత్యుల అండదండలు... ఇంకేం అడ్డుసుకున్నారో ఏమో... ప్రధాన రహదారిని ఆక్రమించి స్కూల్ పార్కింగ్ ప్రదేశంగా మార్చివేశారు. ఏకంగా ఓ రహదారిని మొత్తం మూసివేసి వాహనాల పార్కింగ్ కు వాడుకుంటున్నారు. ఈ దారిలో వీరు ఆడిందే ఆట, పాడిందే పాట.. స్కూల్ ముందున్న ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల పార్కింగ్ మాత్రమే కాదు, తమకు ఆటంకంగా మారితే ఇక్కడి ట్రాఫిక్ ను సైతం గంటలకొద్ది నిలిపివేస్తారు స్కూల్ సెక్యూరిటీ సిబ్బంది.. దీని కారణంగా ఈ దారిలో వచ్చే వాహనదారులు ట్రాఫిక్ జామ్ తో నిత్య నరకం చూస్తున్నారు.. ఈ స్కూల్ అరాచకంపై నిత్యం ఫిర్యాదులు రావడంతో ఎట్టకేలకు స్పందించిన జిహెచ్ఎంసి గురువారం స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. "

తరువాయి 3లో


ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్

# రెండో స్థానానికి రోహిత్

» 5లో



# అలా అడిగితే పొగరంటారు: అనుపమ పరమేశ్వరన్

» 5లో



# భారత్‌కు మరింత చేరువయ్యేందుకు చాట్‌జీపీటీ యత్నం..!

» 4లో




# 65 లక్షల మంది పేర్లు వెల్లడించండి



- బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ డ్రైవ్ నిర్వహించి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల ..
- ఓటర్ల జాబితా నుంచి ఎందుకు తొలగించారు?.. కారణాలు చెప్పండి
- బిహార్‌లో జాబితా నుంచి తొలగించిన ఓటర్ల విషయంలో ఈసీకి సుప్రీం ఆదేశం
  19వ తేదీలోగా ఈసీ వెబ్‌సైట్లలో ప్రచురించాలి
- బ్లాక్‌డెవలప్‌మెంట్ /పంచాయతీ ఆఫీసుల్లోనూ నోటీసుబోర్డుపై ఆ జాబితాను అతికించాలి
- మళ్లీ దరఖాస్తు చేసుకునేవారు సమర్పించే పత్రాల్లో ఒకటిగా ఆధార్‌నూ పరిగణించాలి
- వెబ్‌సైట్‌లో ప్రచురించే జాబితా.. ఓటర్ ఐడీతో వెతుక్కోగలిగేలా ఉండాలి: సుప్రీం ధర్మాసనం
- బిహార్‌లో తొలగించిన ఓటర్లపై సుప్రీం

తరువాయి 2లో

# పుతిన్, ట్రంప్ భేటీ విఫలమైతే.. భారత్‌పై మరిన్ని సుంకాలు



- యూఎస్ మంత్రి స్కాట్ బెస్సెంట్ వ్యాఖ్యలు
- ట్రంప్, పుతిన్ భేటీ విఫలమైతే..
- యూఎస్ మంత్రి స్కాట్ బెస్సెంట్ వ్యాఖ్యలు
- చైనా విషయంలో ఏం చేయాలో డొనాల్డ్ ట్రంప్‌కు బాగా తెలుసు
- రష్యా నుంచి చమురు కొంటున్నందుకే.. రష్యాపై ఆంక్షలు కఠినం చేస్తాం

న్యూయార్క్,ఈ కబురు: ఉక్రెయిన్‌తో యుద్ధ విరమణ అంశంపై రష్యా, అమెరికా మధ్య చర్చలు విఫలమైతే.. భారత్‌పై సుంకాలు మరింతగా పెంచుతామని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ ప్రకటించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తుండటమే దీనికి కారణమని చెప్పారు. అమెరికాలోని అలాస్కాలో శుక్రవారం (భారత కాలమానం ప్రకారం శనివారం) రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్లూమ్‌బర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్కాట్ బెస్సెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. "పుతిన్ తీరుతో అందరూ విసిగిపోయి ఉన్నారు. ఈసారి ఆయన సానుకూల చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఒకవేళ ట్రంప్, పుతిన్ చర్చలు సఫలం కాకపోతే.. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై సుంకాలు మరింతగా పెంచుతాం. రష్యాపై ఆంక్షలు కఠినతరం చేస్తాం" అని పేర్కొన్నారు.

తరువాయి 2లో



# ఓటు చౌర్యంపై.. బిహార్ నుంచి రాహుల్ సమరం

*17 నుంచి ఓటర్ అధికార్ యాత్ర*

*సెప్టెంబరు 1న పట్నా గాంధీ మైదానంలో ముగింపు*

*'ఓటు చౌర్యం' అనే నీచ పదాన్ని వాడొద్దు: ఈసీఐ*

*నైరాశ్యంలో రాహుల్ గాంధీ: రవిశంకర్ ప్రసాద్*

» 3లో

# సీఎంను కలిసిన రాహుల్ సిప్లిగంజ్, అందెశ్రీ





హైదరాబాద్, ఈ కబురు: ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఇటీవల ఆయనకు 1 కోటి రూపాయల నగదు ప్రోత్సాహకం అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం జూబ్లీహిల్స్‌లోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ప్రముఖ కవి అందెశ్రీ కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

తరువాయి 3లో



# తెలంగాణలో ఆర్థిక సంక్షోభం

» 3లో

మొదటి పేజీ తరువాయి

# కశ్మీరులో వరద కల్లోలం



చోసితి గ్రామంలో ఎటుచూసినా భయానక దృశ్యాలే కనిపిస్తున్నాయి. హఠాత్తుగా వచ్చిన వరదలకు దాదాపు గ్రామమంతా తుడిచిపెట్టుకుపోయింది. మృతదేహాలు, క్షతగాత్రులతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. గత నెల 25న మొదలైన మాచైల్ మాతా యాత్రలో భాగంగా చోసితి నుంచి భక్తులు కాలినడకన 8.5 కి.మీ. మేర కొండలు ఎక్కుతూ 9500 అడుగుల ఎత్తులో ఉన్న ఈ గుడికి చేరుకోవాల్సి ఉంటుంది. కిష్త్వార్ పట్టణానికి 90 కి.మీ. దూరంలో చోసితి ఉంటుంది. బేస్ పాయింట్‌లో మెరుపు వరదలు సంభవించిన వెంటనే కిష్త్వార్ డిప్యూటీ కమిషనర్ పంకజ్‌కుమార్ శర్మ రంగంలోకి దిగారు. సహాయక బృందాలను అక్కడికి తరలించడంతో పాటు ఆయన స్వయంగా ఘటనా స్థలానికి వెళ్లారు. “కిష్త్వార్‌లోని చోసితిలో మెరుపు వరదలు వచ్చాయి. మాచైల్ మాతా యాత్రకు బేస్ క్యాంప్ కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఉంటారు. భారీగా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. నా కార్యాలయానికి నిరంతరం సమాచారం అందజేస్తున్నారు” అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే చోసితికితరలి వెళ్లాయని, అదనపు బృందాలు, హెలికాప్టర్లను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. సహాయక చర్యల్లో సైన్యాన్ని కూడా రంగంలోకి దించారు. 300 మంది సైనికులు చోసితిలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.

**ఎల్జీ, సీఎంతో మాట్లాడిన అమిత్ షా**

కిష్త్వార్‌లో మెరుపు వరదల ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ), సీఎంలతో మాట్లాడారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు. కాగా, చోసితి గ్రామంలో సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఎల్జీ మనోజ్ సిన్హా తెలిపారు.మాచైల్ యాత్ర నిలిపివేతమాచైల్ మాతా మందిరం సముద్ర మట్టానికి సుమారు 2,800 మీటర్ల ఎత్తులో ఉంది. గత నెల 25న మొదలైన ఈ యాత్రకు జమ్మూ డివిజన్ నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చారు. ఈ పెను విషాదం నేపథ్యంలో మాచైల్ యాత్రను నిలిపివేశారు. చోసితిలో మెరుపు వరదలతో జమ్మూకశ్మీరు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు, భక్తులకు సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. కాగా, జమ్మూకశ్మీరులోని రాజౌరి తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రియాసి జిల్లాలోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే మార్గాన్ని గురువారం మూసివేశారు. వర్షాలకు తావి, చీనాబ్ తదితర నదులకు మెరుపు వరదలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**అత్యంత విషాదకర ఘటన: రాష్ట్రపతి**

జమ్మూకశ్మీరులో మెరుపు వరదల ఘటన అత్యంత విషాదకరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా..

హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. మేఘవిస్ఫోటంతో మెరుపు వరదలు వచ్చాయి. సిమ్లా, లాహోల్‌స్పితి ప్రాంతాల్లో చాలా నిర్మాణాలు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారులతో సహా 396 మార్గాలను మూసివేశారు. సిమ్లాలోని విద్యుత్తు సరఫరా కార్యాలయం కూడా దెబ్బతింది. అయితే, ప్రాణ నష్టానికి సంబంధించిన సమాచారం అందలేదని అధికారులు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# ఉగ్రవాదంపై మానవత్వ పోరాటం: ద్రౌపది ముర్ము



ఈ కబురు,న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల పాశవిక దాడికి దీటైన జవాబుగా ఉగ్రస్థావరాలను నేలమట్టంచేస్తూ భారత్ సర్కార్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శ్లాఘించారు. రక్షణరంగంలో స్వావలంబన దిశలో దూసుకెళ్తున్న భారత్‌ను రాష్ట్రపతి మెచ్చుకున్నారు. 79వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. కీలకాంశాలు ఆమె మాటల్లోనే..

మానవీయ పోరాటానికి మచ్చుతునక

సెలవుల్లో సరదాగా గడిపేందుకు పహల్గాంలోని లోయ ప్రాంతానికి వచ్చిన అమాయకుల ప్రాణాలను ఉగ్రవాదులు పొట్టన బెట్టుకోవడం అత్యంత అమానవీయం. దీనికి దీటైన జవాబిస్తూ సరిహద్దు వెంట, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భారత త్రివిధదళాలు అత్యంత కచ్చిత త్వంతో, సాంకేతిక సామర్థ్యంతో ఉగ్రస్థావరాలను నేలమట్టం చేశారు. ఉగ్రవాదంపై మానవత్వం చేసిన పోరాటానికి ఆపరేషన్ సిందూర్ ఒక ప్రబల నిదర్శనం. ఉగ్రవాదంపై అంతర్జాతీయ పోరులో ఆపరేషన్ సిందూర్ ఒక కీలక ఘట్టంగా నిలిచి పోతుంది. రక్షణరంగంలో ‘ఆత్మనిర్భర్ భారత్’ విజయానికి ఆపరేషన్ సిందూర్ కొలమానం.

అవినీతిని సహించలేని సుపరిపాలన

ప్రజాస్వామ్య వృక్షానికి అవినీతి, వంచన ఫలాలు కాయొద్దని గాంధీ హెచ్చరించారు. ఆయన ఆదేశా లను శిరసావహిస్తూ దేశం నుంచి అవినీతిని కూకటి వేళ్లతో పెకలించాలి. అవినీతిని సహించలేని సుపరి పాలన కావాలి. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ వంటికి స్వదేశీ స్ఫూర్తిని కొనసాగిస్తున్నాయి. దేశీయ ఉత్ప త్తులను కొందాం, వినియోగిద్దాం అని సంకల్పం తీసుకుందాం.

కశ్మీర్ రైలుతో పర్యాటకం, వాణిజ్యం పైపైకి

కశ్మీర్ లోయలో చినాబ్ నదిపై నూతన రైలు వంతెన మన భారతీయ ఇంజనీరింగ్ అద్భుతం. అంజీఖడ్ తీగల వంతెన సైతం కీలకమైంది. చినాబ్ నది మీదుగా కశ్మీర్‌కు తొలిసారిగా నూతన రైళ్ల రాకపోకలు ఆరంభమై కశ్మీర్‌లో పర్యాటకం, వాణిజ్యం మరింత ఊపందుకుంటోంది. రైళ్లు అక్కడికి కొత్త ఆర్థిక అవకాశాలను మోసుకొస్తాయి. రైల్వే అనుసంధానంతో ఆ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి బాటలు పడుతున్నాయి.

మొదటి పేజీ తరువాయి

## ‘పార్టీకి, పదవికి రాజీనామా చేయండి.. లేకపోతే చంపేస్తాం’!



**పార్టీకి, పదవికి రాజీనామా చేయండి లేకపోతే చంపేస్తామంటూ బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మావోయిస్టుల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరించారు.**

**రఘునందన్‌కు మావోయిస్టుల పేరిట బెదిరింపు**

బంజరాహిల్స్, ఈ కబురు: పార్టీకి, పదవికి రాజీనామా చేయండి లేకపోతే చంపేస్తామంటూ బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మావోయిస్టుల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరించారు. ఈ నెల 8వ తేదీన బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని తన కుమార్తె డాక్టర్ ఎం. సింధు ఇంటికి రఘునందన్‌రావు వచ్చారు.ఇదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను మావోయిస్టునని వెంటనే పార్టీకి రాజీనామా చేయడంతో పాటు, ఎంపీ పదవిని వదులుకోవాలని లేదంటే చంపేస్తామని బెదిరించాడు. దాంతో ఈ నెల 13న పోలీసులకు రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా ఇలాంటి బెదిరింపు కాల్స్ తనకు అనేకమార్లు వచ్చాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# పుతిన్, ట్రంప్ భేటీ విఫలమైతే.. భారత్‌పై మరిన్ని సుంకాలు



రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తుండటమే దీనికి కారణమని చెప్పారు. అమెరికాలోని అలాస్కాలో శుక్రవారం (భారత కాలమానం ప్రకారం శనివారం) రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్లూమ్‌బర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్కాట్ బెస్సెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. “పుతిన్ తీరుతో అందరూ విసిగిపోయి ఉన్నారు. ఈసారి ఆయన సానుకూల చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఒకవేళ ట్రంప్, పుతిన్ చర్చలు సఫలం కాకపోతే.. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై సుంకాలు మరింతగా పెంచుతాం. రష్యాపై ఆంక్షలు కఠినతరం చేస్తాం” అని పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ కంటే ఎక్కువ చమురు కొంటున్న చైనా సంగతి ఏమిటని విలేకరి ప్రశ్నించగా.. అధ్యక్షుడు ట్రంప్ కంటే ముందే తానేమీ చెప్పలేనని, ఏం చేయాలో ఆయనకు బాగా తెలుసని స్కాట్ బెస్సెంట్ చెప్పారు. రష్యాపై మరింత ఒత్తి తెచ్చేందుకు యూరోపియన్ దేశాలు అమెరికా వెంట నిలవాలని కోరారు. మరోవైపు, అమెరికా, భారత్ మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, ప్రయోజనాల ఆధారంగా ముందుకు సాగుతాయని, మెరుగుపడతాయని ఆశిస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, కొన్ని సమయాల్లో అది సవాళ్లను ఎదుర్కొన్నా ముందుకు సాగిందని చెప్పారు. రక్షణ రంగానికి సంబంధించి అమెరికా, భారత్ మధ్య బలమైన బంధం ఉందని.. ఇది ద్వైపాక్షిక సంబంధాలకు కీలక ఆధారమని తెలిపారు

మొదటి పేజీ తరువాయి

# 65 లక్షల మంది పేర్లు వెల్లడించండి

న్యూఢిల్లీ, ఈ కబురు: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) డ్రైవ్ నిర్వహించి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లనూ వెల్లడించాలని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. వారిని ఓటర్ల జాబితా నుంచి ఎందుకు తొలగించారో కారణాలు సైతం స్పష్టం చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం నిర్దిష్ట ఆదేశాలు జారీ చేసింది. ఆ వివరాలను.. జిల్లాలవారీగా సంబంధిత జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లతోపాటు, బిహార్ ఎన్నికల ప్రధాన అధికారి వెబ్‌సైట్‌లో కూడా ఆగస్టు 19లోగా ప్రచురించాలని సూచించింది. ఏ ఓటరును ఎందుకు తొలగించారనే విషయాన్ని.. ఓటర్ ఐడీ నంబర్ల సాయంతో తెలుసుకునేలా ఆ డాక్యుమెంట్లు ఉండాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొంది. ఎవరైనా ఓటర్ల జాబితాలో తమ పేరు మళ్లీ చేర్చాలంటూ దరఖాస్తు సమర్పించేటప్పుడు.. వారు గుర్తింపు పత్రంగా ఆధార్‌కార్డును కూడా సమర్పించవచ్చని పేర్కొంటూ పేపర్లలో, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో బహిరంగ నోటీసులు ఇవ్వాలని సూచించింది. ఓటు హక్కుకు సంబంధించి.. ఆమోదించతగ్గ 11 పత్రాల్లో ఆధార్ కార్డును కూడా చేర్చాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు.

**రాజకీయ పార్టీలకు ఇచ్చాం..**

జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను బూత్‌ల స్థాయిలో రాజకీయ పార్టీల ఏజెంట్లకు ఇప్పటికే ఇచ్చామని ఈసీ తరఫున వాదనలు వినిపించిన రాకేశ్ ద్వివేది గురువారం కోర్టుకు తెలపగా.. తమ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు ఓటర్లు రాజకీయ పార్టీల దగ్గరికి ఎందుకు వెళ్లాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. “ఓటర్లు స్థానిక రాజకీయ పార్టీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేని యంత్రాంగం మీ వద్ద లేదా? ఇంటర్‌నెట్ ద్వారా మీరు ఈ పని ఎందుకు చేయకూడదు?” అని జస్టిస్ సూర్యకాంత్ ఈసీని ప్రశ్నించారు. దీనికి రాకేశ్ ద్వివేదీ.. ఓటర్ ఐడీ నంబర్‌తో వెతకడం ద్వారా జాబితాలో తమ పేరు ఉన్నదీ లేనిదీ ఓటర్లు తెలుసుకునే వీలుందని జవాబిచ్చారు. దీనికి ధర్మాసనం.. తొలగించినవారి పేర్ల జాబితానే ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించింది. “చనిపోయిన/ఒకచోటు నుంచి మరోచోటుకు వెళ్లిపోయిన/రెండుచోట్ల ఉన్నవారి పేర్లనుఎందుకు పెట్టరు?” అని జస్టిస్ బాగ్చీ అడిగారు. “మీరు ఆ వివరాలను బహిరంగపరిస్తే.. ఈసీ మీద ఉన్న అభిప్రాయాలు మారుతాయి” అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. పారదర్శకత వల్ల ఓటర్లలో విశ్వాసం కలుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో లేనివారి పేర్లు కారణాలతో సహా వెల్లడిస్తే ఓటర్లు పరిష్కార చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని.. కాబట్టి అందరికీ అర్థమయ్యే భాషలో, సామాన్యులకు అనుకూలంగా ఉండే విధంగా.. తొలగించిన వారి పేర్లు వెల్లడించాలని ఆయన స్పష్టం చేశారు. ఉదాహరణకు.. పూనం దేవి అనే మహిళ పేరు తొలగిస్తే.. తన పేరు ఎందుకు తొలగించారో తెలుసుకునేలా ఆ జాబితా ఉండాలని సూచించారు. ఈసీ అప్‌లోడ్ చేసే పత్రాలు ‘సెర్చబుల్ ఫార్మాట్’లో.. అంటే, ఓటరు గుర్తింపు కార్డు నంబరుతో వెతుక్కోగలిగేలా ఉండాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు గోపాల్ శంకరనారాయణన్, వృందా గ్రోవర్ కోరగా జస్టిస్ సూర్యకాంత్ అందుకు అంగీకరించారు. అయితే, ఆ విధంగా ఓటర్ల జాబితాను ప్రచురించాల్సిన అవసరం లేదంటూ 2018లో కమల్‌నాథ్‌కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని రాకేశ్ ద్వివేదీ గుర్తుచేయగా.. డాక్యుమెంట్‌ను అలా వెతుక్కోగలిగేలా రూపొందించడం వల్ల ఏ సమస్యా ఉండదని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

**ఇవీ ఆదేశాలు..**

బిహార్‌లో సమగ్ర ఓటర్ల జాబితాకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం జారీ చేసిన ఆరు నిర్దిష్ట ఆదేశాలు..

1)తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో ప్రదర్శించాలి. వారిని ఓటరు జాబితాలో ఎందుకు చేర్చలేదో ఆ కారణాన్ని నిర్దిష్టంగా పేర్కొనాలి. ఓటర్ ఐడీకార్డు నంబర్ ద్వారా ఈ సమాచారం తెలుకునేలా ఉండాలి.

2) తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను వెబ్‌సైట్‌లో ప్రచురించిన విషయాన్ని.. బిహార్‌లోని ప్రాంతీయ వార్తాపత్రికల ద్వారా ప్రజలకు ప్రజలకు తెలిసేలా చేయాలి. టీవీ, రేడియో చానళ్లలో వెల్లడించాలి. జిల్లా ఎన్నికల అధికారులకు.. అధికారిక సోషల్ మీడియా ఖాతా ఉంటే దాని ద్వారా కూడా ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి.

3) ఆన్‌లైన్‌లోనే కాక ప్రజలకు మాన్యువల్‌గా కూడా అందుబాటులో ఉండేలా.. ఈ 65 లక్షల ఓటర్ల జాబితాను (తొలగింపునకు కారణాలతో సహా) ప్రతి బూత్ స్థాయి అధికారీ.. తమ తమ బ్లాక్ డెవలప్‌మెంట్/పంచాయతీల్లో నోటీస్ బోర్డుపై

అతికించాలి.

4) జాబితాలో తమ పేర్లు లేనివారు ఆధార్ కార్డు ప్రతితో ఫిర్యాదు చేయవచ్చని బహిరంగ నోటీసుల్లో పేర్కొనాలి.

5) ముసాయిదా జాబితాలో లేనివారి పేర్లతో కూడిన సాఫ్ట్‌కాపీని రాష్ట్ర ఎన్నికల అధికారులకు సమర్పించాలి. ఈ మొత్తం జాబితాను బిహార్ సీఈవో వెబ్‌సైట్‌లో ఉంచాలి.

6) వెబ్‌సైట్ జాబితాలో పేర్లను ఎపిక్ (ఓటర్ గుర్తింపు కార్డు) నంబర్ ఆధారంగా వెతుక్కోగలిగేలా ఉండాలి.

ఓడితే చెడ్డవి.. గెలిస్తే మంచివట!

రాజకీయ పార్టీలు ఓడిపోయినప్పుడు ఈవీఎంలు చెడ్డవని తిడుతున్నాయని, గెలిచినప్పుడు మాత్రం మంచివే అంటున్నాయని.. తీవ్ర రాజకీయ వైరుధ్యాలున్న వాతావరణంలో తాము పనిచేయాల్సి వస్తోందని.. తాము తీసుకున్న ప్రతి నిర్ణయాన్నీ కోర్టుల్లో సవాల్ చేస్తున్నారని ఈసీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ కోర్టుకు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ సహా కొన్ని నిర్ణయాలు తీసుకునే అధికారం రాజ్యాంగంలోని 324వ అధికరణం కింద తమకు (ఈసీ) ఉందని ఆయన స్పష్టం చేశారు.

**ప్రజాస్వామ్యాన్ని రక్షించిన సుప్రీం**

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని రక్షించిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో భారత ఎన్నికల సంఘం చేస్తున్న దారుణాన్ని తాము తీవ్రంగా ప్రశ్నించామని ఆయన గుర్తుచేశారు. తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాలను బహిర్గతం చేయాలని రాహుల్ డిమాండ్ చేస్తున్నారని.. ఇప్పుడు సుప్రీంకోర్టు సైతం అవే ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. పార్లమెంటులో దీనిపై చర్చపెట్టాలంటూ రాహుల్ నేతృత్వంలో తాము అడుగుతుంటే.. స్పీకర్ వాయిదాలతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. కానీ, సుప్రీంకోర్టు సరైన తీర్పు ఇచ్చిందన్నారు. రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్ ప్రలోభాలకు గురైతే తీరని నష్టం జరుగుతుందని, ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ సమస్య కాదని, దేశంలోని ప్రతి పౌరుడూ ప్రశ్నించాల్సిన అంశమని పేర్కొన్నారు.



# స్థానికంపై తేలేది పీఏసీలోనే



ఎన్నికలను ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై పార్టీలో రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. వెంటనే నిర్వహిస్తే మేలని ఎక్కువ మంది మంత్రులు సూచించినట్లు తెలుస్తోంది. కానీ, బీసీలకు 42% రిజర్వేషన్ల అంశంపై తేలేదాకా ఎన్నికలు నిర్వహించవద్దని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మెజార్టీ నేతల అభిప్రాయం తెలుసుకోవడానికే పీఏసీ సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో కమిటీ సభ్యులతో చర్చించిన తర్వాత మెజార్టీ అభిప్రాయం మేరకు ఎన్నికలను ఎప్పుడు నిర్వహించాలో నిర్ణయిస్తారని నేతలు చెబుతున్నారు. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సైతం పీఏసీ సమావేశం ఏర్పాటు చేసి... ఎన్నికల నిర్వహణపై ఒక నిర్ణయానికి రావాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెలాఖరులోగా మండల కాంగ్రెస్ కమిటీల నియామకాలన్నీ పూర్తి చేయాలని తాజాగా నిర్ణయించారు. ఒకవేళ వచ్చే నెలలో ఎన్నికలు జరిగితే ఈ కమిటీలన్నీ చురుగ్గా పనిచేసేలా పార్టీ కోసం కష్టపడేవారిని మాత్రమే నియమించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లకు సూచించారు. ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీకి కూడా ఒక్కో జిల్లా నుంచి పేర్ల జాబితాలను వెంటనే పంపాలని సూచించారు. జిల్లాల్లో పార్టీ కోసం ఎవరు కష్టపడి పనిచేస్తున్నారో గుర్తించి ఎంపిక చేయాలని ఇన్‌ఛార్జి మంత్రులకు పీసీసీ సూచించింది. స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహించాలనే అంశంలో రెండు వాదనలు ఉన్నమాట వాస్తవమేనని... అందుకే పీఏసీ సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని మహేశ్‌కుమార్‌గౌడ్ ‘ఈనాడు’కు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేస్తున్నందున స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ వర్గాలకు తప్పనిసరిగా 42% వరకూ టికెట్లు కేటాయించాలని తాను కోరుతున్నట్లు చెప్పారు. రిజర్వేషన్ల అంశం తేలిన అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని హైకోర్టుకు విన్నవించి... మరింత గడువు కోరాలని ప్రభుత్వానికి సూచిస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రజల మనోగతంపై ఆరా...

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రజల మనోగతాన్ని తెలుసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అంతర్గత సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలు, ఇన్‌ఛార్జులను నియమించినందున... వారి ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు, పాతవారి మధ్య విభేదాలున్నందున... వారికి సర్దిచెప్పి ఎన్నికలకు సిద్ధం చేయాలని పీసీసీకి ఏఐసీసీ సూచించింది.

# టెస్కాబ్, డీసీసీబీ, పీఏసీఎస్ పాలక వర్గాల పదవీకాలం పొడిగింపు




హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీసీబీ), తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) పాలకవర్గాల పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సహకార చట్టంలోని 32(7)(ఏ) సెక్షన్ ప్రకారం.. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం కొత్త ఆదేశాలు వచ్చేవరకు కొనసాగుతుంది. పనితీరు సరిగా లేకపోయినా, సొసైటీల్లో అవినీతి, ఆరోపణలు వచ్చినా విచారణ జరిపించి చర్యలు తీసుకునే అధికారం సహకారశాఖ రిజిస్ట్రార్‌కు కల్పించారు. రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. పాత తొమ్మిది జిల్లాలకు డీసీసీబీలు, రాష్ట్రస్థాయిలో టెస్కాబ్ ఉన్నాయి. వీటిన్నింటి పాలకవర్గాల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించటం విశేషం. సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఆయా పాలకవర్గాల కోసం తక్షణమే ఎన్నికలు జరపటం సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులను జారీచేసింది. ఇంతకుముందు 2024 ఫిబ్రవరి 24న సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పదవీకాలాన్ని పొడిగించారు.

మొదటి పేజీ తరువాయి

## తెలంగాణలో ఆర్థిక సంక్షోభం



ఈ కబురు: వరుసగా రెండు నెలలు తెలంగాణ ద్రవ్యోల్బణం మైనస్‌లోకి పోయిందని.. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందనడానికి ఇది నిదర్శనమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. "కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్ల పాటు దేశానికే ఆదర్శంగా నిలిచిన రాష్ట్రం.. కేవలం 20 నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థికంగా చితికిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాలే ఇందుకు కారణం. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా జూన్, జులై నెలల్లో ద్రవ్యోల్బణం మైనస్‌లో నమోదైంది. జులైలో రాష్ట్ర ద్రవ్యోల్బణం -0.44%గా ఉండగా.. జాతీయ సగటు +2.10%గా ఉంది. జూన్‌లో రాష్ట్రంలో -0.93%గా ఉంటే.. దేశవ్యాప్తంగా +1.55%గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో డిఫ్లేషన్(ద్రవ్యోల్బణం తగ్గుదల) మరింత తీవ్రంగా ఉంది. ప్రజలు అత్యవసరాలకు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలన్నీ స్తంభించిపోయాయి. కొత్త ఉద్యోగాల కల్పన లేకపోవడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే ఈ పరిస్థితికి కారణమన్న ఆర్థిక నిపుణుల సూచనలను ప్రభుత్వం పట్టించుకోవాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

**సింగపూర్ తెలుగు సమాజం నుంచి కేటీఆర్‌కు ఆహ్వానం**

సింగపూర్‌లోని ప్రముఖ తెలుగు సాంస్కృతిక సంస్థ 'సింగపూర్ తెలుగు సమాజం' తన స్వర్ణోత్సవ వేడుకలకు కేటీఆర్‌ను ప్రధాన అతిథిగా ఆహ్వానించింది.ఈ నెల 31న జరగనున్న ఈ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ఆ సంస్థ అధ్యక్షుడు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తాజాగా లేఖ రాశారు. వారి ఆహ్వానాన్ని కేటీఆర్ అంగీకరించారు.

మొదటి పేజీ తరువాయి

## ఓక్రిడ్జ్ స్కూల్ పార్కింగ్ అరాచకం



రహదారిపై వాహనాల పార్కింగ్ తో ఏర్పడిన ట్రాఫిక్ జామ్




భారీకేడ్లు ఏర్పాటు చేసి ఇతర వాహనాలను అడ్డుకుంటున్న స్కూల్ సెక్యూరిటీ సిబ్బంది

గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలోని ఖాజాగూడలో ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఉంది. నగరంలోనే హైఫై స్కూల్ గా పేరు తెచ్చుకున్న ఈ స్కూల్ లో చదువుతున్న వారంతా బడాబాబుల పిల్లలే. విద్యార్థులు, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల పేరెంట్స్ అందరూ వచ్చేది లగ్జరీ కార్లలోనే. ఓక్రిడ్జ్ స్కూల్ కు సువిశాలమైన క్యాంపస్ ఉన్నా, అందులోకి వాహనాలకు ప్రవేశం లేదు. పక్కనే స్కూల్ పార్కింగ్ ఉన్నా, అందులో కేవలం స్కూల్ బస్సులకే ప్రవేశం. స్కూల్ కు వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, తల్లిదండ్రుల కార్ల పార్కింగ్ కు స్థలం లేకపోవడంతో స్కూల్ యాజమాన్యం కన్ను ముందున్న రహదారిపై పడింది. ఏకంగా స్కూల్ ముందున్న జిహెచ్ఎంసి రహదారిని మూసివేసి తమ పార్కింగ్ ప్రదేశంగా మార్చుకున్నారు. ఈ దారిలో ఇతర వాహనాలు ప్రవేశించకుండా భారీకేర్లను ఏర్పాటు చేసి మరీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంటున్నారు. దీంతోపాటు స్కూల్ పక్కనే ఉన్న ఖాజాగూడ ప్రధాన రహదారిని సైతం ఆక్రమించి వాహనాల పార్కింగ్ చేస్తున్నారు.

పాతముంబయి రహదారి నుంచి ఐటి కారిడార్ ను కలిపే ప్రధాన రహదార్డిపై నిత్యం వేలాది మంది ఐటి ఉద్యోగులు, వాహనదారులు ప్రయాణిస్తుండగా, ఓక్రిడ్జ్ స్కూల్ అక్రమ పార్కింగ్ కారణంగా ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అక్రమ పార్కింగ్ తో రహదారి కుంచించుకుపోయి ఉదయం, సాయంత్రం వేళల్లో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. దీనికి తోడు రహదారిని మొత్తం తమ ఆధీనంలోకి తీసుకుంటున్న స్కూల్ సెక్యూరిటీ తమ స్కూల్ వాహనాలు వచ్చే సమయంలో ట్రాఫిక్ ను నిలిపివేస్తున్నారు. దీని కారణంగా ఔటర్ రింగ్ రోడ్ సర్కిల్ వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి.

**జిహెచ్ఎంసి షోకాజు నోటీసు జారీ..**

ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ అక్రమ పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఓక్రిడ్జ్ స్కూల్ యాజమాన్యానికి గురువారం జీహెచ్ఎంసీ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. జీహెచ్ఎంసీ చట్టం 1955, టిజిబిపాస్ చట్టం 2020ని ఓక్రిడ్జ్ స్కూల్ ఉల్లంఘించి ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమైందంటూ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి నోటీసు జారీ చేశారు. నోటీసు అందిన మూడు రోజుల్లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఓక్రిడ్జ్ స్కూల్ యజమాన్యానికి సూచించారు. నోటీసుపై స్పందించకపోతే పాఠశాల యాజమాన్యం మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా రహదారి మీద పార్కింగ్ చేసిన వాహనాలను వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో పార్కింగ్ కోసం రహదారిని ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని ఓక్రిడ్జ్ స్కూల్ యాజమాన్యాన్ని



స్కూల్ ముందు రహదారిని మూసివేసి పార్కింగ్ కు వాడుకుంటున్న దృశ్యం



ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్

## ఓటు చౌర్యంపై..బిహార్ నుంచి రాహుల్ సమరం



**17 నుంచి ఓటర్ అధికార్ యాత్ర**

**సెప్టెంబరు 1న పట్నా గాంధీ మైదానంలో ముగింపు**

**'ఓటు చౌర్యం' అనే నీచ పదాన్ని వాడొద్దు: ఈసీఐ**

**నైరాశ్యంలో రాహుల్ గాంధీ: రవిశంకర్ ప్రసాద్**

న్యూఢిల్లీ, ఈ కబురు: 'ఓటు చౌర్యం'పై కేంద్ర ప్రభుత్వంతోపాటు.. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కి వ్యతిరేకంగా గళమెత్తిన కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ.. ఈ నెల 17 నుంచి సమర శంఖం పూరించనున్నారు. బిహార్ నుంచి ఆయన 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యంగా తమ యాత్ర కొనసాగుతుందని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. ''ఓటు చౌర్యం అనేది కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశం కాదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, 'ఒక వ్యక్తిఒక ఓటు' సూత్రాన్ని కాపాడే నిర్ణయాత్మక సమరం మాది. ఈ సమరంతో ఓటు దొంగల ఓటమి జరగాలి. ప్రజలు విజయం సాధించాలి. రాజ్యాంగం విజయం సాధించాలి'' అని ఆయన వ్యాఖ్యానించారు. 17న ప్రారంభం కానున్న ఓటర్ అధికార్ యాత్ర.. సెప్టెంబరు 1న పట్నాలోని గాంధీ మైదానంలో జరిగే మహాసభతో ముగుస్తుంది. ఈ ఉద్యమాన్ని విస్తరించేందుకు కాంగ్రెస్ నేతలు గురువారం 'లోక్‌తంత్ర బచావో మషాల్ మార్చ్', ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 7 వరకు 'ఓట్ చోర్.. గద్దీ చోర్' సభలు.. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కాగా.. గతవారం రాహుల్ గాంధీ బెంగళూరులోని మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో లక్షకు పైగా ఓట్లు తారుమారయ్యాయంటూ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే..! ఇదే అంశంపై విపక్షాలు పార్లమెంట్‌ను అట్టుడికించాయి. మరోవైపు ఈ అంశంపై రాబర్ట్ వాద్రా తీవ్రంగా స్పందించారు. రాహుల్, ప్రియాంక దేశమంతా తిరిగి, ప్రజలకోసం కష్టపడుతున్నారని, ప్రజలు ఈ పోరాటాన్ని గుర్తించకపోతే.. బీజేపీ తప్పుడు మార్గాల్లో గెలుస్తూనే ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, రాహుల్ గాంధీ నైరాశ్యంలో ఉన్నారని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

**'ఓటు చౌర్యం' పదాన్ని వాడొద్దు: ఈసీఐ**

'ఓటు చౌర్యం' అనే పదాన్ని వాడొద్దంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) సూచించింది. ''ఎవరైనా రెండుసార్లు ఓటు వేశారనడానికి ఆధారాలుంటే.. ప్రమాణపత్రంతో సమర్పించండి. అంతేకానీ, ఇలాంటి నీచ పదాన్ని వాడొద్దు'' అని స్పష్టం చేసింది. 1951 నుంచి 'ఒక వ్యక్తి ఒక ఓటు' చట్టం అమల్లో ఉందని గుర్తుచేసింది. కోట్ల మంది ఓటర్లను, లక్షల మంది ఎన్నికల సిబ్బందిని 'ఓటు దొంగలు' అని పిలవడం వారి గౌరవంపై దాడి చేయడమేనని వ్యాఖ్యానించింది.

## పాలమూరులో దంచికొట్టిన వాన

**పోల్కంపల్లి వద్ద వాగులో గొర్రెలను ఒడ్డుకు చేరుస్తున్న పోలీసులు, గ్రామస్తులు**

**కల్వకుర్తిలో అత్యధికంగా 15 సెం.మీ. వర్షపాతం నమోదు**

**పరిగి మండలంలో కంపించిన భూమి**

ఈ కబురు, మహబూబ్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. జోగుళాంబ గద్వాల జిల్లా మినహా మిగిలిన అన్ని చోట్ల వాగులు, కాల్వలు పొంగిపొర్లాయి. రహదారులు దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటలు అలుగు పారాయి. మహబూబ్‌నగర్‌లోని హనుమాన్‌పురా, అప్పన్నపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జీలకు ఉన్న రిటైనింగ్ వాల్స్ కూలిపోయాయి. దీంతో పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే 1,000 మంది విద్యార్థులతోపాటు అటు వైపు ఉన్న గొల్లబండతండాకు రాకపోకలు నిలిచిపోయాయి. జడ్చర్ల పరిధిలోని కావేరమ్మపేట వద్ద నల్లచెరువు కట్ట తెగి సమీపంలోని ఇళ్లలోకి వరదనీరు చేరింది.

జడ్చర్ల, మిడ్జిల్‌తోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు, కల్వకుర్తి, ఉప్పునుంతల మండలాల్లో దుందుభి నది ఉధృతంగా ప్రవహించింది. మూసాపేట మండలంపోల్కంపల్లి వద్ద పెద్ద వాగు మధ్యలో గొర్రెలు, వాటి కాపరులు చిక్కుకుపోగా రిస్క్ బృందం వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.మహబూబ్‌నగర్‌మున్సిపాలిటీ సమీపంలో దివిటిపల్లి నుంచి అమర్‌రాజా బ్యాటరీ కంపెనీకి వెళ్లే రోడ్డు వర్షం నీటికి పూర్తిగా ధ్వంసం కాగా.. గురువారం తెల్లవారుజామున సిబ్బందిని తీసుకువెళ్తున్న కంపెనీ బస్సు అందులో బోల్తా పడడంతో 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

జడ్చర్ల వద్ద సర్వీస్‌రోడ్డుపై మోకాళ్లలోతు నీటి ప్రవాహంలో హైదరాబాద్ వెళుతున్న ఆర్టీసీ బస్సు తోపాటు, ఓ ప్రైవేట్ బస్సు తెల్లవారుజామున నిలిచిపోయాయి. దీంతో వరద నీటిలో చిక్కుకున్న 50 మంది ప్రయాణికులను అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా రోడ్డుపైకి తీసుకొచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైల ఉత్తర ముఖ ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం వద్ద కొండ చరియలు విరిగి పడ్డాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో 14.46 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లాలో మరికల్ 12.62, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో 12.3 సె.మీ. వనపర్తి జిల్లాలో ఖిల్లాలాఘనపురంలో 11.68, పెద్దమందడిలో 10.33, వనపర్తిలో 9.88, సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**వరద బీభత్సం**

హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉంది. లోలెవల్ బ్రిడ్జీల వద్ద వరద ప్రమాదకరంగా మారింది.నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయ సమీపంలో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపైకి వరద భారీగా చేరింది. మేళ్లచెర్వు- కోదాడ ప్రధాన రహదారిపై కందిబండ సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉద్యాన తోటలు నీట మునిగి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. పరిగి మండలం బసిరెడ్డిపల్లి, రంగాపూర్, న్యాయత్‌నగర్, హనుమాన్‌గండి గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున 3.55 గంటలకు 3 నుంచి 4 సెకన్ల పాటు భూమి కంపించింది. గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్ద వాగు పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పత్తి చేలను వరద ముంచెత్తింది.



## జాతీయవాదం స్ఫూర్తితోనే 'హర్ ఘర్ తిరంగ'



**జాతీయవాదమే స్ఫూర్తిగా బీజేపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమం చేపడుతున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పేర్కొన్నారు.**

**తెలంగాణలో 40 లక్షల ఇళ్లపై త్రివర్ణ పతాకం ఎగురవేస్తాం**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు**

హైదరాబాద్ సిటీ/కేపీహెచ్‌బీకాలనీ,ఈ కబురు: జాతీయవాదమే స్ఫూర్తిగా బీజేపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమం చేపడుతున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీని రాంచందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. అలాగే, స్వచ్ఛభారత్ అబియాన్ ఆధ్వర్యంలో మార్చ్ ఫర్ ది నేషన్ పేరిట కూకట్‌పల్లి నియోజకవర్గంలో 1000 మీటర్ల జాతీయ జెండాతో నిర్వహించిన తిరంగా ర్యాలీని కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో రాంచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల ఇళ్లపై త్రివర్ణ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటడం, జాతీయ భావం పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. మతం ఆధారంగా నాడు దేశాన్ని విభజించిన బ్రిటిషర్లకు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికిందని అన్నారు. మరోసారి దేశ విభజన ప్రసక్తి ఉండకూడదనే లక్ష్యంతో భారతదేశ ఐక్యత, సమగ్రతను, సంస్కృతిని కాపాడేలా తిరంగా యాత్ర ద్వారా సంకల్పం తీసుకున్నామన్నారు. తిరంగా యాత్ర ప్రతీ పౌరుడి గుండెలో దేశభక్తిని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నెక్లెస్ రోడ్డులో చేపట్టిన తిరంగా ర్యాలీలో పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన రాహుల్ సిప్లిగంజ్, అందెశ్రీ

**ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.**

హైదరాబాద్, ఈ కబురు: ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఇటీవల ఆయనకు 1 కోటి రూపాయల నగదు ప్రోత్సాహకం అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం జూబ్లీహిల్స్‌లోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి కృత జ్ఞతలు తెలిపారు. మరోవైపు ప్రముఖ కవి అందెశ్రీ కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

**సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సింగర్ రాహుల్ సిప్లిగంజ్..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ భేటీ అయ్యారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో ఆయనను రాహుల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాహుల్‌కు కోటి రూపాయల నగదు ప్రోత్సాహకం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రాహుల్‌ను శాలువ కప్పి సత్కరించారు. సీఎంను కలిసిన వారిలో రాహుల్‌తో పాటు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి తదితరులు ఉన్నారు.కాగా, ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో తను పాడిన 'నాటు నాటు' సాంగ్‌కు ఆస్కార్ అవార్డు రావడంతో దేశవ్యాప్తంగా సింగర్ రాహుల్ సిప్లిగంజ్ పాపులర్ అయ్యారు. ఆ ఒక్క పాటతో ఎంతో మంది అభిమానుల మనసు గెలుచుకున్నారు. అయితే, 2023లో ఓ ప్రోగ్రామ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాహుల్ సిప్లిగంజ్‌కు కోటి రూపాయల నగదు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు జూలై 20న పాతబస్తీ బోనాల సందర్భంగా రాహుల్‌కు కాంగ్రెస్ సర్కార్ రూ.కోటి ప్రోత్సాహకం ప్రకటించింది.





## ఆపరేషన్ సిందూర్ వీరులకు శౌర్య పతకాలు

న్యూఢిల్లీ, ఈ కబురు: ఆపరేషన్ సిందూర్ సమయంలో అసాధారణ ధైర్యసాహసాలు, అసమాన శౌర్యపరాక్రమాలు ప్రదర్శించిన 16 మంది సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బందికి శౌర్య పతకాలు లభించాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ దళాలకు పురస్కారాలు ప్రకటించింది. సరిహద్దుల్లోని వేర్వేరు పోస్టుల్లో విధులు నిర్వర్తించిన సబ్ ఇన్‌స్పెక్టర్ వ్యాస్ దేవ్, కానిస్టేబుల్ సుద్ది రభా, అసిస్టెంట్ కమాండెంట్ అభిషేక్ శ్రీవాస్తవ్, హెడ్ కానిస్టేబుల్ బ్రిజ్ మోహన్ సింగ్, కానిస్టేబుళ్లు భూపేంద్ర బాజ్‌పాయ్, రాజన్ కుమార్, బసవరాజ శివప్ప సుంకడ, దేపేశ్వర్ బర్మన్, డిప్యూటీ కమాండెంట్ రవీంద్ర రాథోడ్, ఇన్‌స్పెక్టర్ దేవీ లాల్, హెడ్ కానిస్టేబుల్ సాహిబ్ సింగ్, కానిస్టేబుల్ కన్వ రాజ్ సింగ్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ వీర్ సింగ్, ఏఎస్ఐ రాజప్ప, కానిస్టేబుల్ మనోహర్ క్సాల్క్సో, అసిస్టెంట్ కమాండెంట్ అలోక్ నేగి అవార్డుకు ఎంపికయ్యారు. వీరిలో కొందరు పాక్ డ్రోన్‌లను కూల్చివేయగా, మరికొందరు శత్రు దేశ నిఘా వ్యవస్థలను ధ్వంసం చేశారు. గాయపడిన సహచరులను రక్షించారు. కాగా, వివిధ ఆపరేషన్లలో పాల్గొన్న ఇతర పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళాల సిబ్బందికి కూడా శౌర్య పతకాలు ప్రకటించింది. 1,090 మందికి పోలీసు మెడల్స్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 1,090 మంది పోలీసు సిబ్బందికి కేంద్రం సేవా పతకాలను ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ గురువారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. 233 మందికి గ్యాలంట్రీ పతకాలు(జీఎం), 99 మందికి రాష్ట్రపతి విశిష్ఠ సేవా పతకాలు(పీఎస్ఎం), 758 మందికి పోలీసు విశిష్ఠ సేవా (ఎంఎస్ఎం) పతకాలను ప్రకటించింది. శౌర్య పతకాలు పొందిన వారిలో జమ్మూకశ్మీర్ నుంచి అత్యధికంగా 152 మంది ఉండగా, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న 54మందికి, ఇతర ప్రాంతాలకు చెందిన 27 మందికి అవార్డులు ఇవ్వనుంది.



# ఇప్పుడు ఒరాకిల్ వంతు.. కృత్రిమ మేధ కోసం ఉద్యోగాల కోత..!

సిలికాన్ వ్యాలీ టెక్ దిగ్గజాలు ఉద్యోగాల కోతలు కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా భారీగా లే ఆఫ్‌లు విధించగా.. తాజాగా ఒరాకిల్ కూడా అదే బాట పట్టింది. తన క్లౌడ్ విభాగంలో ఉన్నత స్థాయి ఉద్యోగులను తొలుత లక్ష్యంగా చేసుకొని తొలగింపులు చేపట్టింది. సియాటెల్ ఆఫీస్‌లో మొత్తం 161 మందిని తొలగించినట్లు వాషింగ్టన్ రాష్ట్ర ఉద్యోగ భద్రతా విభాగానికి సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది.

సియాటెల్ ఆఫీస్‌లో ఈ క్లౌడ్ దిగ్గజానికి దాదాపు 400 మంది ఉద్యోగులున్నారు. దీంతో దాని డేటా సెంటర్ల ఆపరేషన్స్ టెక్నీషియన్స్, క్లౌడ్‌బృందాలు, ఏఐ, ఎంఎల్ బృందాల టెక్నికల్ ప్రాజెక్ట్ మేనేజర్లపై లేఆఫ్‌ల ప్రభావం పడింది.




ప్రస్తుతం అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ వంటి క్లౌడ్, డేటా సెంటర్ల దిగ్గజాలు ఏఐ మోడల్స్‌పై ఆధారపడటానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయి. పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను నియంత్రించేందుకు వీలుగా ఉద్యోగులను తగ్గించుకొంటున్నాయి. మైక్రోసాఫ్ట్ ఇప్పటికే 15 వేల మందిని తొలగించిన సంగతి తెలిసిందే. ఆ లేఆఫ్‌ల అనంతరం మిగిలిన ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ బలమైన సందేశం పంపింది. ఏఐలో నైపుణ్యాలను పెంచుకోవడంపై వారు దృష్టిపెట్టాలని సూచించింది. వివిధ డివిజన్లలో 15,000 మంది ఉద్యోగులను సంస్థ విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. 2025లో ఇప్పటివరకు ఈ సంస్థ మొత్తం నాలుగు విడతల్లో ఉద్యోగులను తొలగించింది.

ప్రస్తుతం ఒరాకిల్ స్టార్‌గేట్ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉంది. దీని విలువ 500 బిలియన్ డాలర్లుగా అంచనావేశారు. ఇందులో ఓపెన్ ఏఐ, సాఫ్ట్‌బ్యాంక్ వంటి కంపెనీలు కూడా భాగస్వాములు. గతేడాదే ఒరాకిల్ తన ప్రధాన కార్యాలయాన్ని ఆస్టిన్ నుంచి నాష్‌విల్లేకు మార్చినట్లు ప్రకటించింది.

భారత్‌లో కూడా టెక్ దిగ్గజాలు కృత్రిమ మేధలో తమ సత్తా చాటేందుకు ఉద్యోగుల సంఖ్యను గణనీయగా తగ్గించుకొని.. ఏఐ వైపు అడుగులు వేస్తున్నాయి. ఇటీవలే టీసీఎస్ 2 వేల మంది ఉద్యోగులను దశలవారీగా తగ్గించుకొంటామని ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 2 శాతానికి సమానం. ఏఐ కారణంగా 4 లక్షల నుంచి 5 లక్షల ఉద్యోగాలు రెండు మూడేళ్లలో పోయే అవకాశం ఉందని రాయిటర్స్ నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే.

# భారత్‌కు మరింత చేరువయ్యేందుకు చాట్‌జీపీటీ

భారతీయ యూజర్లకు మరింత చేరువయ్యేందుకు ఓపెన్‌ఏఐ ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా దేశీయ కరెన్సీలో చాట్‌జీపీటీ ధరలను నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిని ప్రయోగాత్మకంగా పరిశీలించాలని భావిస్తోంది. ఓపెన్ ఏఐ ఇటువంటి ప్రయోగాలు చేస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటని 'మనీకంట్రోల్' కథనంలో పేర్కొంది.

భారతీయ కస్టమర్లు మరింత సులువుగా చెల్లింపులు జరిపేలా దీనిని చేపట్టింది. ప్రస్తుతం మన దేశంలోని కస్టమర్లు చాట్‌జీపీటీ ప్లస్ ప్లాన్‌కు నెలకు 20 డాలర్లు, ప్రో ప్లాన్‌కు 200 డాలర్లు, బిజినెస్ ప్లాన్‌లో ప్రతి సీట్‌కు 30 డాలర్ల చొప్పున చెల్లిస్తున్నారు. సరికొత్త ప్లాన్ల ప్రకారం చాట్‌జీపీటీ ప్లస్‌కు జీఎస్టీతో కలిపి రూ.1,999, ప్రో ప్లాన్‌కు రూ.19,900, బిజినెస్ ప్లాన్‌లో ప్రతి సీటుకు రూ.2,099 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.




ఓపెన్ ఏఐ అత్యంత అడ్వాన్స్‌డ్ ఏఐ మోడల్ చాట్‌జీపీటీ5ను ఇటీవలే పరిచయం చేసింది. ఈ కొత్త మోడల్ కోడింగ్, మ్యాథ్స్, రైటింగ్, హెల్త్‌కేర్ వంటి అనేక రంగాల్లో అత్యుత్తమ పనితీరును కనబరుస్తుందని కంపెనీ తెలిపింది. ఓపెన్ ఏఐ ఇప్పటివరకు తయారుచేసిన అత్యంత శక్తిమంతమైన మోడల్‌గా దీనిని పేర్కొంది. ముఖ్యంగా వేగం, విశ్లేషణ సామర్థ్యాల్లో మునుపటి మోడళ్ల కంటే మెరుగ్గా పనిచేస్తుందని

# అనుమతిస్తే పునప్రారంభానికి సిద్ధం: ఇండిగో




ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం కుదిరిన వెంటనే చైనాకు ప్రత్యక్ష విమాన సర్వీసులను పునరుద్ధరించేందుకు ఇండిగో సిద్ధమవుతోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ) పీటర్ ఎల్బర్స్ తెలిపారు. కొవిడ్19 పరిణామాల కారణంగా 2020 ప్రారంభంలో నిలిపివేసిన చైనా కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఆంక్షలకు ముందు ఈ సంస్థ న్యూఢిల్లీ నుంచి చెంగ్డూ, కోల్‌కతాగ్వాంగ్ జౌ మధ్య రోజువారీ సర్వీసులను నడిపేది.

**ద్వైపాక్షిక ఒప్పందంపై ఆశలు..**

ప్రత్యక్ష విమాన కనెక్టివిటీని పునరుద్ధరించడానికి భారత్, చైనాలు సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికీ, అధికారిక అనుమతులు ఇంకా ఖరారు కాలేదు. ప్రత్యక్ష సేవలను తిరిగి ప్రారంభించేందుకు మార్గాలను అన్వేషించడానికి ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రతినిధి స్థాయి చర్చలు జరిగాయి. కొవిడ్19కు ముందు తాము చైనాకు విమానాలు నడిపేవారమని, ప్రభుత్వం ఒక ఒప్పందానికి వస్తే వాటిని పునప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని ఎల్బర్స్ చెప్పారు. 2020 ప్రారంభం నుంచి భారతదేశంచైనా మధ్య ప్రత్యక్ష విమాన కనెక్టివిటీ లేదు. ఆ ఏడాది చివర్లో లద్దాఖ్‌లోని గాల్వన్ లోయలో జరిగిన సైనిక ఘర్షణలతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇది దౌత్య, ఆర్థిక సంబంధాలపై ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం భారతదేశంహాంకాంగ్ మధ్య విమాన సర్వీసులు నడుస్తున్నాయి. అక్కడి నుంచి చైనాకు వెళ్లాల్సి ఉంటుంది.

**ప్రధాన సమస్య**

ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో భారత విమానయాన సంస్థలపై చైనా విధించిన విమాన ఛార్జీల నిబంధనల అంశం ప్రాధానమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మార్కెట్ డిమాండ్ ఆధారంగా ఛార్జీలను నిర్ణయించడానికి విమానయాన సంస్థలకు అనుమతిస్తూ, అధిక ధరల స్వేచ్ఛ కోసం భారత్ ఒత్తిడి తెస్తోంది. చైనాలో తమ గత నిర్వహణ అనుభవాలపై భారత ప్రభుత్వం విమానయాన సంస్థల నుంచి ఫీడ్‌బ్యాక్ కోరిందని సీనియర్ అధికారులు తెలిపారు.

ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరితే భారత విమానయాన మార్కెట్లోకి చైనీస్ చౌక ధరల విమాన యాన సంస్థల ప్రవేశానికి గ్రీన్ సిగ్నల్ వస్తుంది. ఇది ద్వైపాక్షిక పర్యాటకం, వ్యాపార ప్రయాణాన్ని పెంచే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం ఐదేళ్ల విరామం తర్వాత ఇటీవల చైనా పౌరులకు టూరిస్ట్ వీసాలు జారీ చేసే ప్రక్రియను తిరిగి ప్రారంభించింది.



# రైలు టిక్కెట్లపై 45 శాతం సబ్సిడీ

మన దేశంలో అత్యంత చవకైన ప్రజారవాణా అంటే రైల్వేలే! సుదూర ప్రాంతాలకు కూడా చాలా తక్కువ ఖర్చుతో తీసుకెళ్తాయి. ప్రయాణికుల కోసం రైలు సర్వీసులను కూడా ఏటా పెంచుతూ వస్తోంది రైల్వే శాఖ. ఈ క్రమంలో ప్యాసింజర్ టిక్కెట్ల మీద ఏటా కొన్ని వేల కోట్ల రూపాయల సబ్సిడీని అందిస్తోంది. ఉదాహరణకు ప్యాసింజర్ రైళ్లు అందిస్తున్న సేవ విలువ రూ.100 అనుకుంటే, టిక్కెట్టు ధర రూ.55 మాత్రమే. మిగతా 45% సబ్సిడీ రైల్వే శాఖే భరిస్తోంది. మరోపక్క రైలు ప్రయాణాల్లో భద్రత విషయంలో కూడా ప్రభుత్వం చేసే ఖర్చు ఏటా పెరుగుతోంది.

**కొన్ని గణాంకాలు**

2019-20లో దేశంలో రోజుకు సగటున నడిచిన ప్యాసింజర్ రైళ్ల సంఖ్య 13,169.

2024-25లో ఈ ప్యాసింజర్ రైళ్ల సంఖ్య 13,940.

2025-26లో... 2025 జూలై వరకు ప్రారంభమైన కొత్త రైలు సర్వీసులు 86

దేశంలో 2025 ఆగస్ట్ 7 నాటికి నడుస్తున్న వందే భారత్ రైళ్లు 144

2023-24లో ప్యాసింజర్ టిక్కెట్ల మీద ఇచ్చిన మొత్తం సబ్సిడీ రూ. 60,466 కోట్లు

రైలు ప్రయాణాలు, స్టేషన్లలో భద్రతకు సంబంధించి 2023-24లో రైల్వే శాఖ చేసిన వ్యయం రూ. 1,14,022 కోట్లు



# స్టాక్ మార్కెట్‌లో కొత్త ఇండెక్స్

బీఎస్ఈ ఇండెక్స్ సర్వీసెస్ విభాగం తాజాగా డిఫెన్స్ ఇండెక్స్‌ను ప్రారంభించింది. బీఎస్ఈ 1000 ఇండెక్స్‌లోని డిఫెన్స్ థీమ్ స్టాక్స్ ఈ సూచీలో ఉంటాయి. ఏటా రెండు సార్లు (జూన్, డిసెంబర్‌లో) ఇండెక్స్‌లో మార్పులు, చేర్పులు చేస్తారు. విధాన సంస్కరణలు, పెరుగుతున్న బడ్జెట్ కేటాయింపులు, దేశీయంగా తయారీపై మరింతగా దృష్టి పెరుగుతుండటం తదితర సానుకూల అంశాలతో డిఫెన్స్ రంగం గణనీయంగా వృద్ధి చెందనుందని బీఎస్ఈ ఇండెక్స్ సర్వీసెస్ వివరించింది.

ఈ నేపథ్యంలో ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ మొదలైన ప్యాసివ్ ఫండ్స్‌కి ఇండెక్స్ ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించింది. అలాగే, పీఎంఎస్ వ్యూహాలు, మ్యుచువల్ ఫండ్ స్కీములు, ఫండ్ పోర్ట్‌ఫోలియోల పనితీరు మదింపునకు దీన్ని ప్రామాణికంగా ఉపయోగించుకోవచ్చని పేర్కొంది.





# ఒక్కనెలలో 4300 మంది కొన్న కారు ఇదే..

ఇండియన్ మార్కెట్లో ఎలక్ట్రిక్ కార్లకు మంచి డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని దాదాపు అన్ని కంపెనీలు తమ ఉత్పత్తులను ఎలక్ట్రిక్ రూపంలో లాంచ్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. 'విండ్సర్ ఈవీ' పేరుతో ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేసింది. ఇది ప్రారంభం నుంచి ఎక్కువమంది కస్టమర్లను ఆకర్షిస్తూ.. గొప్ప అమ్మకాలను పొందుతోంది. గత నెలలో (జులై 2025) కూడా విండ్సర్ సేల్స్ 4308 యూనిట్లుగా నమోదైంది. దీంతో దేశంలో అత్యధికంగా అమ్ముడైన ఎలక్ట్రిక్ కారుగా రికార్డ్ క్రియేట్ చేసింది.

ఎంజీ విండ్సర్ అమ్మకాలు మొత్తం 36,000 యూనిట్లకు చేరుకున్నాయి. దీన్నిబట్టి చూస్తే మార్కెట్లో ఈ కారుకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. కంపెనీ మార్కెట్ వాటా పెరగడానికి కూడా ఈ కారు దోహదపడింది. విండ్సర్ నెలవారీ అమ్మకాలు 17 శాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది.

**ఎంజీ విండ్సర్ ఈవీ**

ఎంజీ విండ్సర్ ఐదు వేరియంట్లలో లభిస్తుంది. అవి ఎక్సైట్ (38kWh), ఎక్స్‌క్లూజివ్ (38kWh), ఎసెన్స్ (38kWh), ఎక్స్‌క్లూజివ్ ప్రో (52.9kWh), ఎసెన్స్ ప్రో (52.9kWh). కస్టమర్లు ఫిక్స్డ్ బ్యాటరీ ఆప్షన్ లేదా బ్యాటరీయాజ్ఎసర్వీస్ (BaaS) సబ్‌స్క్రిప్షన్లలో ఏదైనా ఎంచుకోవచ్చు. దీని ధరలు రూ. 14.00 లక్షల నుంచి రూ. 18.31 లక్షల (ఎక్స్ షోరూం) మధ్య ఉన్నాయి. ధరలు ఎందుకుని వేరియంట్, బ్యాటరీ ఆప్షన్ల మీద ఆధారపడి ఉంటాయి.

విండ్సర్ ఎలక్ట్రిక్ కారులో పర్మినెంట్ మాగ్నెట్ సింక్రోనస్ మోటారు ఉంటుంది. ఇది 136 పీఎస్ పవర్ 200 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇది 37.9 కిలోవాట్ బ్యాటరీ ద్వారా 332 కిమీ రేంజ్, 52.9 కిలోవాట్ బ్యాటరీ ద్వారా 449 కిమీ రేంజ్ అందిస్తుందని ఏఆర్ఏఐ ధ్రువీకరించింది. వాస్తవ ప్రపంచంలో, వివిధ వాతావరణ పరిస్థితుల్లో.. రేంజ్ అనేది కొంత తగ్గే అవకాశం ఉంటుంది.

# ఇండస్ట్రీలో ఎవరి కుంపటి వారిదే.. అల్లు అరవింద్ సంచలన కామెంట్స్

టాలీవుడ్ నిర్మాత అల్లు అరవింద్ సంచలన కామెంట్స్ చేశారు. ఇండస్ట్రీలో ఎవరి కుంపటి వారిదేనంటూ బాంబు పేల్చారు. అందుకే ఎలాంటి మంచి పనులు చేయలేకపోతున్నామని మాట్లాడారు. సైమా అవార్డుల ప్రెస్‌మీట్‌కు హాజరైన అరవింద్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగు సినిమాలకు 7 జాతీయ అవార్డులు వచ్చాయని.. ఇండస్ట్రీ స్పందించి సత్కరించకముందే సైమా గుర్తించిందని తెలిపారు.

జాతీయ అవార్డులపై సైమా స్పందించి విజేతలను సత్కరించడం అభినందనీయమని అన్నారు. మనకు ఎన్నీ జాతీయ అవార్డులు వచ్చినా టాలీవుడ్ సినీ పరిశ్రమ మాత్రం స్పందించలేదన్నారు. జాతీయ అవార్డులను ఒక పండుగగా జరుపుకోవాల్సిన గొప్ప వేడుక అని అల్లు అరవింద్ వెల్లడించారు.

కాగా.. ఇటీవల ప్రకటించిన 71వ జాతీయ అవార్డుల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరి నిలిచింది. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి, బేబీ మూవీ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత అవార్డుకు ఎంపికైన డైరెక్టర్ సాయి రాజేశ్, బేబీ సినిమా పాటకు ఉత్తమ సింగర్‌గా పీవీఎన్ఎస్ రోహిత్‌ను సైమా టీమ్ సత్కరించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు ప్రశాంత్ వర్మ, సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా, మంచు లక్ష్మి కూడా పాల్గొన్నారు.



# రూ.31 కోట్లతో ఆస్తి కొనుగోలు చేసిన హృతిక్ రోషన్

కొత్త సినిమా వార్ 2తో అలరిస్తున్న బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ నటనలోనే కాదు వ్యాపారంలోనూ దూసుకుపోతున్నారు. ఆస్తులు కూడబెట్టడంలో, వాటి విలువను పెంచడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఇటీవల ముంబయిలోని ఓ ఆస్తిని కొనుగోలు చేయడంతో అందుకు సంబంధించిన వివరాలు వైరల్ అవుతున్నాయి.


హృతిక్ రోషన్ తన తండ్రి రాకేష్ రోషన్ స్థాపించిన హెచ్ఆర్ఎక్స్ డిజిటెక్ ఎల్ఎల్‌పీ కంపెనీ కోసం ముంబైలోని చండీవాలి ప్రాంతంలో మూడు కార్యాలయ యూనిట్లను రూ.31 కోట్లకు కొనుగోలు చేశారు. అంధేరీ ఈస్ట్‌లోని చండీవలి ప్రాంతంలోని బూమరాంగ్ పేరుతో ఉన్న భవనం మొదటి అంతస్తులోని ఈ మూడు కార్యాలయాలు 13,546 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. దీనికి సంబంధించి 2025 జులై 9న కొనుగోలు జరిగిందని డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తుంది.

ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ప్రకారం ఈ లావాదేవీలో స్టాంప్ డ్యూటీ రూ.1.86 కోట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.30 వేలుగా ఉంది. ఈ లావాదేవీలో అమ్మకందారులుగా మనీష్‌కృష్ణం గోపాల్ బజారీ, షాలిని మనీష్ బజారీ, బాజ్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి.



ఈ భవనంలో రోషన్ కుటుంబం పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి కాదు. సెప్టెంబర్ 2024లో హెచ్ఆర్ఎక్స్ డిజిటెక్ ఎల్ఎల్‌పీ ఐదో అంతస్తులోని ఐదు కార్యాలయ యూనిట్లను రూ.37.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఇందులో 17,389 చదరపు అడుగుల స్థలం ఉంది.

ఇంతకు ముందు రోషన్ కుటుంబం రూ.6.75 కోట్లకు అంధేరీలో మూడు అపార్ట్ మెంట్లను విక్రయించింది. అంధేరీ వెస్ట్‌లోని విజయ్ నివాస్ సీహెచ్ఎస్ లిమిటెడ్ భవనంలో 1,025 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ను రాకేష్ రోషన్ విక్రయించారు. ఈ ఆస్తితో పాటు రెండు పార్కింగ్ స్థలాలను సోనాలి అజ్మీరాకు రూ.3.75 కోట్లకు విక్రయించారు. మే 25న జరిగిన ఈ లావాదేవీలో రూ.18.75 లక్షల స్టాంప్ డ్యూటీ చెల్లింపు, రూ.30,000 రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఉన్నాయి. మరో లావాదేవీలో రాకేష్ రోషన్ అంధేరి వెస్ట్‌లోని రహేజా క్లాసిక్ భవనంలోని 625 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ను జీవన్ భావనానీ, శిల్పా వాధ్వానీ, గౌరవ్ వాధ్వానీ అనే ముగ్గురు వ్యక్తులకు రూ.2.20 కోట్లకు విక్రయించారు. ఈ లావాదేవీ మే 17న నమోదు కాగా, స్టాంప్ డ్యూటీ రూ.13.20 లక్షలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.30 వేలు చెల్లించారు.



# అలా అడిగితే పొగరంటారు: అనుపమ పరమేశ్వరన్

'పరదా' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి అనుపమ పరమేశ్వరన్ . ఆమె ప్రధానపాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ అనుపమ తన కెరీర్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు తాను ఎంతో మారినట్లు చెప్పారు.

"ఇండస్ట్రీలో కొనసాగడం చాలా కష్టం. ఒక్కోసారి హీరోయిన్స్ అడిగే చిన్న చిన్న విషయాలను కూడా చిత్రబృందం సీరియస్‌గా తీసుకుంటుంది. గతంలో ఇలాంటి సంఘటనలు చాలా ఎదుర్కొన్నాను. వాళ్లకు నచ్చని విషయాలు చెబితే వెంటనే పొగరు అని అంటారు. చిత్రీకరణ అనుకున్న సమయానికి ఎందుకు ప్రారంభించలేదని అడిగితే యాటిట్యూడ్ ఉందని అంటారు. గతంలో ఇలాంటివి నేను ఎన్నో చూశాను. ఉదయం 7 గంటలకల్లా రెడీ అయితే.. 9.30 వరకు చిత్రీకరణ ప్రారంభించరు. కో స్టార్స్ ఆలస్యంగా వస్తారని తెలిసినా.. నేను మాత్రం ఏడు గంటలకల్లా సిద్ధంగా ఉండాలి. వాళ్ల కోసం గంటన్నర ఎదురుచూడాలి. ఇదే విషయాన్ని టీమ్‌ను అడిగితే పొగరు ఎక్కువైంది అని అంటారు. అలా ఎవరైనా అంటే ఒకప్పుడు బాధపడేదాన్ని.. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను"

"ఆ గంటన్నరలో సినిమాకు సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించుకోవచ్చు. ఇదే విషయం దర్శకనిర్మాతలతో చెబితే 'నా డబ్బులు కదా నీకెందుకు' అంటారు. ఒకవేళ ఇదే విషయం హీరోలు చెబితే వాళ్లకు ఇలాంటి సమాధానం చెప్పరు. ఇండస్ట్రీలో మాత్రమే కాదు.. బయట కూడా ఇదే పరిస్థితి ఉంది. మహిళలను ఇలానే చూస్తారు" అని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. 'పరదా' కచ్చితంగా హిట్ కావాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. కమర్షియల్‌గా హిట్ అయితేనే భవిష్యత్తులో ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తాయని అన్నారు.

# నాన్న కోసమే రజనీకాంత్ ఆ మూవీలో నటించారు.. అంతేకాదు!



రజనీకాంత్ నడుచుకుంటూ వస్తే చాలు రికార్డులు వాటంతటవే వస్తాయి. బస్ కండక్టర్ నుంచి సూపర్‌స్టార్‌గా ఎదిగిన రజనీ ప్రస్థానం ఎందరికో ఆదర్శనీయం. ఆగస్టు 15 నాటికి రజనీ సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి 50 ఏళ్లు పూర్తవుతాయి. ఈ సందర్భంగా రజనీ ఆప్త మిత్రుడు మోహన్‌బాబు కూతురు మంచు లక్ష్మి అనేక విషయాలను పంచుకుంది.

**నాన్న చిన్నపిల్లాడిగా..**

మంచు లక్ష్మి మాట్లాడుతూ.. రజనీ అంకుల్ మమ్మల్ని ఎంతో ప్రేమిస్తాడు. మాక్కూడా ఆయనంటే చాలా ఇష్టం. అంకుల్ వచ్చాడంటే మా నాన్న చిన్నపిల్లాడయిపోతాడు. ఇప్పటికీ వాళ్లిద్దరూ ఒకరినొకరు సరదాగా ఆట పట్టించుకుంటూ ఉంటారు. 50 ఏళ్లుగా కొనసాగుతున్న అందమైన స్నేహం వారిది. నటులవ్వడానికి ముందు నుంచే ఇద్దరూ మంచి మిత్రులు.

**కష్టసుఖాల్లోనూ..**

మా నాన్న ఎప్పుడైనా బాధలో ఉంటే అంకుల్ సపోర్ట్‌గా నిలబడతాడు. అలాగే అంకుల్‌కు ఏదైనా కష్టమొచ్చిందంటే నాన్న తోడుగా ఉంటాడు. అన్ని రకాల పరిస్థితుల్లోనూ ఇద్దరూ కలిసే ఉంటారు. అలాంటి ఫ్రెండ్ దొరకాలని ప్రతి ఒక్కరూ ఆ దేవుడిని కోరుకోవాల్సిందే! పెదరాయుడు సినిమాలో అంకుల్ గెస్ట్ రోల్ చేశాడు.

**పెదరాయుడు మూవీలో..**

నిజానికి ఆయనకు ఆ సినిమా చేయాల్సిన అవసరం లేదు. కానీ కేవలం ఫ్రెండ్‌షిప్ కోసం మాత్రమే ఆ మూవీలో యాక్ట్ చేశాడు. నాన్న కోసం ఆయన స్వయంగా రాయలసీమ రామన్న చౌదరి సినిమా కథ రాసిచ్చాడు. అదీ వారి ఫ్రెండ్‌షిప్ గొప్పదనం. వ్యక్తిగతంగానే కాకుండా కెరీర్‌లోనూ ఒకరికొకరు తోడుగా ఉన్నారు అని మంచు లక్ష్మి చెప్పుకొచ్చింది.

# నటి శిల్పా శెట్టి దంపతులకు బిగ్ షాక్.. కేసు నమోదు

**ఢిల్లీ: బాలీవుడ్ నటి శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రాకు బిగ్ షాక్ తగిలింది. వారిద్దరిపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసినట్లు ఆరోపిస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శిల్పా శెట్టి దంపతులపై కేసు నమోదైంది. అనంతరం, ఈ కేసు దర్యాప్తును ఆర్థిక నేరాల విభాగం కి అప్పగించారు.**

**వివరాల ప్రకారం.. ముంబైకి చెందిన వ్యాపారవేత్త, లోటస్ క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ డైరెక్టర్ దీపక్ కొఠారి.. నటి శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రాపై తీవ్ర ఆరోపణలు చేశారు. 2015-2023 మధ్య కాలంలో శిల్పా శెట్టి దంపతులు.. రూ.60 కోట్లు మోసం చేశారని ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించారు. తన వ్యాపార సంస్థలను విస్తరించడానికి తాను ఆ డబ్బును పెట్టుబడి పెట్టానని కొఠారి ఫిర్యాదులో పేర్కొన్నాడు. కానీ.. ఆ**



**నిధులను శెట్టి వ్యక్తిగత ఖర్చుల కోసం ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు.**

**ఫిర్యాదులో భాగంగా.. రాజేశ్ ఆర్య అనే వ్యక్తి ద్వారా తనకు శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా పరిచయం అయినట్టు కొఠారీ తెలిపారు. ఆ సమయంలో వారు బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ అనే హోమ్ షాపింగ్ కంపెనీకి డైరెక్టర్లుగా ఉండేవారని, కంపెనీలో దాదాపు 87.6 శాతం వాటా వారిదేనని చెప్పారు. మొదట 12 శాతం వడ్డీతో రూ. 75 కోట్ల రుణం కావాలని వారు కోరారని, కానీ అధిక పన్నుల భారం నుంచి తప్పించుకునేందుకు ఆ మొత్తాన్ని రుణం బదులుగా పెట్టుబడిగా మార్చాలని తనను ఒప్పించారని కొఠారీ వివరించారు. నెలవారీ రాబడితో పాటు అసలు కూడా తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.**

# యూత్‌ని ఆకట్టుకునేలా 'ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు'

**పార్వతి దేవదాసుల ప్రేమ కథకు ఎంతటి క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈసారి ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు టైటిల్ తో ఓ విభిన్నమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మాహిష్మతి ప్రొడక్షన్స్ బ్యానర్ పై తోట రామకృష్ణ దర్శక నిర్మాత గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. **

**సిద్దార్థ్ మీనన్, దిలీప్ హీరోలుగా రాశి సింగ్ హీరోయిన్ గా నటించారు. రఘు బాబు, కశి రెడ్డి రాజ్ కుమార్, వీర శంకర్, గౌతం రాజు, రాకెట్ రాఘువ, గుండు సుదర్శన్, రవితేజ, రజిత ఇతర కీలక పాత్రలు పోషించారు.**

**రీసెంట్ గా ఈ సినిమాకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదొక కాలేజ్ బ్యాక్ డ్రాప్ లో జరిగే ట్రయాంగిల్ లవ్ స్టోరీ. యువతను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు దర్శకనిర్మాత తోట రామకృష్ణ తెలియజేశారు.**

**సంగీత దర్శకుడు మోహిత్ రహమానియాక్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఆస్కార్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ తో పాటు సుద్దాల అశోక్ తేజ, భాస్కరభట్ల ఆకట్టుకునే సాహిత్యం అందించారు.**



# భారత్ చేతిలోనూ మాకు ఘోర ఓటమి తప్పదు: పాక్ మాజీ క్రికెటర్ ఫైర్




భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే ఆసక్తి లేనిది ఎవరికి ఉంటుంది. కానీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వచ్చేనెలలో జరగబోయే ఆసియా కప్‌ను బహిష్కరించాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు. ఇటీవల ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో పాక్‌తో భారత ఛాంపియన్స్ కూడా సెమీస్‌తోపాటు లీగ్ మ్యాచ్‌ను బహిష్కరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు పాకిస్థాన్ మాజీ ఆటగాడు బసిత్ అలీ కూడా టీమ్‌ఇండియా ఆడకుండా ఉంటేనే బాగుంటుందని వ్యాఖ్యానించాడు. అయితే, అతడి మాటల వెనుక కారణం మరొకటి ఉంది. అది పాకిస్థాన్‌పై ఆగ్రహంతో కామెంట్లు చేశాడు. విండీస్‌తో జరిగిన మూడో వన్డేలో 200+ పరుగుల తేడాతో పాక్ చిత్తు అయింది. కనీస పోరాటం లేకుండా చేతులెత్తేసింది. కెప్టెన్ రిజ్వాన్, స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ ఘోరంగా విఫలమయ్యారు.

''ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడకూడదని భారత్ నిర్ణయం తీసుకోవాలని నేను ప్రార్థిస్తున్నా. డబ్ల్యూసీఎల్‌లో మాదిరిగా టీమ్‌ఇండియా బహిష్కరించాలి. ఒకవేళ మ్యాచ్ జరిగితే మాత్రం భారత చేతిలోనూ పాకిస్థాన్‌కు చావు దెబ్బ తప్పదు. మరీ ఘోరంగా ఓడిపోవడం ఖాయం. ఇప్పుడు మా జట్టు ఉన్న పరిస్థితిని చూస్తే అదేమనిపిస్తుంది. ఆసియా కప్ టీ20 ఫార్మాట్ అయినా సరే పాక్ ఆటగాళ్ల ప్రదర్శన ఏమాత్రం బాగోలేదు. అందుకే, అలా కోరుకుంటున్నా'' అని బసిత్ వ్యాఖ్యానించాడు. ఇప్పటికే షోయబ్ అక్తర్ కూడా పాక్‌పై విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. రావల్పిండి పిచ్‌ను ఎక్కడికంటే అక్కడికి తీసుకురావడం కష్టమని ఎద్దేవా చేశాడు.

**ఆసియా కప్ జరిగేనా?**

ఇప్పటికైతే బీసీసీఐ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. భారత మ్యాచ్‌లను యూఏఈ వేదికగా నిర్వహిస్తామని ఏసీసీ వెల్లడించిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 9 నుంచే ఆసియా కప్ పోటీలు ప్రారంభం కావాల్సి ఉంది. ఇంకా టీమ్‌లను ప్రకటించలేదు. ఈ సారి 8 దేశాలు టైటిల్ కోసం తలపడనున్నాయి. భారత్, పాక్ కాకుండా.. అఫ్గానిస్థాన్, హాంగ్‌కాంగ్, యూఏఈ, బంగ్లాదేశ్, ఒమన్, శ్రీలంక బరిలోకి దిగనున్నాయి.



# 6 నెలల్లో క్రీడా బిల్లు అమలు

**విధివిధానాల రూపకల్పన ప్రారంభం**
**మౌలిక సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి**
**క్రీడారంగంలో పారదర్శకతకు పెద్దపీట**
**కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడి**

**న్యూఢిల్లీ:** రాబోయే ఆరు నెలల్లో జాతీయ క్రీడా బిల్లు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లుకు ఆమోద ముద్ర లభించడంతో... ప్రపంచంలో క్రీడా చట్టం అమల్లోకి వచ్చిన 21వ దేశంగా భారత్ నిలిచింది. ఈ బిల్లు అమలుతో దేశ క్రీడారంగానికి ఎంతో లబ్ధి చేకూరనుంది. మౌలిక వసతులు మెరుగు పడటంతో పాటు... క్రీడల్లో పారదర్శకత పెరగనుంది. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం లభించిన అనంతరం క్రీడా మంత్రి దీనిపై స్పందిస్తూ... ఇప్పటికే నియమ నిబంధనల రూపకల్పన ప్రారంభమైందని వెల్లడించారు.

'ఈ బిల్లు వీలైనంత త్వరగా అమల్లోకి వస్తుంది. రాబోయే ఆరు నెలల్లో వంద శాతం దీన్ని అమలు చేసే విధంగా విధివిధానాలు రూపొందిస్తున్నాం. దీనివల్ల క్రీడారంగానికి ఇతోధిక లబ్ధి చేకూరుతుంది. భారత అథ్లెట్లు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గేనే సమయంలో ఎలాంటి ఆంక్షలు ఉండవు. కాకపోతే జాతీయ విధానానికి అనుగుణంగా కొన్ని సూచనలు ఉంటాయి. ప్రత్యేక పరిస్థితుల్లో దీన్ని వినియోగిస్తారు.

అవసరమైన పోస్టుల సృష్టి, పరిపాలనా అనుమతుల వంటి వాటి ప్రక్రియ ప్రారంభమైంది. జాతీయ క్రీడా బోర్డు (ఎన్ఎస్‌బీ), జాతీయ క్రీడా ట్రైబ్యునల్ (ఎన్ఎస్‌టీ)కు విధానపరమైన అనుమతులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం' అని మాండవీయ పేర్కొన్నారు. స్వతంత్ర భారత దేశంలో క్రీడా రంగంలో ఇది అతిపెద్ద సంస్కరణ అని క్రీడా మంత్రి వెల్లడించారు.

**ప్రభుత్వానికి సర్వాధికారాలు...**

బిల్లు ఆమోదంతో అంతర్జాతీయ ఈవెంట్లలో భారత అథ్లెట్లు పాల్గొనడంపై తుది నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లభించింది. గతంలోనూ ఇదే పద్ధతి కొనసాగినా... దానికంటూ ప్రత్యేకమైన విధానం లేకపోయింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో క్రీడల్లో పోటీపడాల్సి వచ్చిన సందర్భంతో పాటు దౌత్యపరంగా సఖ్యతగా లేని మరే దేశంలో పర్యటించాల్సి వచ్చినా... ప్రభుత్వ నిర్ణయం కీలకం కానుంది.

'ప్రపంచ వ్యాప్తంగా క్రీడా చట్టం అమలవుతున్న దేశాల్లో... అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే అంశంపై ఆయా దేశాల ప్రభుత్వాలదే తుది నిర్ణయం. ఇది కేవలం అసాధారణ పరిస్థితుల కోసం ఉద్దేశించి రూపొందించింది... అంతే తప్ప జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో పొరుగు దేశం కోసం తీసుకొచ్చింది కాదు. జాతీయ భద్రతా బెదిరింపులు, దౌత్య బహిష్కరణలు లేదా ప్రపంచ అత్యవసర పరిస్థితులు వంటివి సంభవించినప్పుడు ఇది ఉపయోగపడుతుంది.

2008 ముంబై దాడుల సమయం నుంచే పాకిస్తాన్‌తో భారత పురుషుల క్రికెట్ జట్టు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడటం లేదు. అప్పటి నుంచి ఇరు జట్ల మధ్య ప్రధాన మ్యాచ్‌లు తటస్థ వేదికలపై జరుగుతున్నాయి. ఆయా సమయాల్లో విదేశాంగ శాఖ అనుమతులతోనే టీమిండియా మ్యాచ్‌లు ఆడుతోంది. ఇకపై కూడా ఈ విధానమే కొనసాగుతుంది' అని కేంద్ర మంత్రి చెప్పారు.

**సుదీర్ఘ చర్చల తర్వాతే...**

ఈ బిల్లు ద్వారా జాతీయ క్రీడా సమాఖ్యలు, జాతీయ క్రీడా ట్రైబ్యునల్, జాతీయ క్రీడా ఎన్నికల ప్యానెల్ ఇలా అన్నింటిని జాతీయ క్రీడా బోర్డు (ఎన్ఎస్‌బీ) పర్యవేక్షణలోకి తీసుకురానున్నారు. దీంతో క్రీడల్లో పారదర్శకత పెరగడంతో పాటు వివాద పరిష్కారం మరింత సులువు కానుంది. ఆరంభంలో ఈ బిల్లుపై అవగాహన కొరవడినా... ఆ తర్వాత జాతీయ క్రీడా సమాఖ్యలు, అథ్లెట్లు, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) దీనికి మద్దతునిచ్చాయని క్రీడా శాఖ మంత్రి వెల్లడించారు.

దేశ వ్యాప్తంగా అన్ని వర్గాలతో చర్చించి విశ్లేషించి 60 రౌండ్లకు పైగా 'చింతన్ శిబిర్'లను నిర్వహించి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించిన అనంతరమే బిల్లును పార్లమెంట్ ముందుంచినట్లు క్రీడా మంత్రి వెల్లడించారు. కొత్త చట్టంతో దేశ క్రీడా రంగం పురోగతి సాధిస్తుందనే నమ్మకముందన్న మాండవీయ... రాబోయే రెండు దశాబ్దాల్లో భారత్‌ను క్రీడల్లో సూపర్ పవర్‌గా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**త్వరలో స్పోర్ట్స్ మెడల్ స్ట్రాటజీ...**

'జాతీయ క్రీడా సమాఖ్యల ప్రతినిధులతో రోజుల తరబడి మాట్లాడిన తర్వాతే ఈ బిల్లును రూపొందించాం. అథ్లెట్లు, కోచ్‌లు, క్రీడా విశ్లేషకులు, నిపుణులు ఇలా ఒక్కరేంటి అందరినీ సంప్రదించాం. బిల్లులోని ప్రతి నిబంధనను వారికి వివరించాం. వాటి అవసరమేంటో స్పష్టంగా చెప్పిన తర్వాత వారి అభిప్రాయాలు తీసుకున్నాం. ఎలాంటి బిల్లు కావాలో వారినే అడిగాం. వారిచ్చిన సూచనలు సలహాలతో పాటు సుప్రీం కోర్టు, హైకోర్టుల్లోని క్రీడా న్యాయవాదుల నుంచి కూడా సలహాలు తీసుకున్నాం.

వారి సూచనలను పరిగణనలోకి తీసుకున్నాం. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం ముసాయిదా క్రీడా బిల్లును రూపొందించింది. కానీ దాన్ని అమలు చేయలేకపోయింది' అని క్రీడా శాఖ మంత్రి వెల్లడించారు. అథ్లెట్లతో సంప్రదింపులు జరుపుతున్న సమయంలోనే క్రీడా సమాఖ్యల్లో వారి ప్రాతినిధ్యం ఉండాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.

'మహిళా అథ్లెట్ల ప్రాతినిధ్యం పెంచాం. ప్రతి జాతీయ క్రీడా సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీలో నలుగురు మహిళా అథ్లెట్లు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు తీసుకొచ్చాం. రానున్న రోజుల్లో 'స్పోర్ట్స్ మెడల్ స్ట్రాటజీ''ని కూడా తీసుకొస్తాం. ఇది అంతర్జాతీయ టోర్నీల్లో మన అథ్లెట్లు పతకాలు సాధించేందుకు రోడ్‌మ్యాప్‌లా నిలవనుంది' అని మాండవీయ ఆశాభావం వ్యక్తం చేశారు.

# 13వ సారి ప్రపంచ రికార్డు

**పురుషుల పోల్‌వాల్ట్‌లో డుప్లాంటిస్ ఘనత**
**6.29 మీటర్లను అధిగమించిన స్వీడన్ స్టార్**



**బుడాపెస్ట్:** ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టడం అలవాటుగా మార్చుకున్న స్వీడన్ విఖ్యాత పోల్‌వాల్టర్ మోండో డుప్లాంటిస్ మరోసారి అదరగొట్టాడు. ఇస్తవాన్ గ్యులాయ్ స్మారక అథ్లెటిక్స్ మీట్‌లో 25 ఏళ్ల డుప్లాంటిస్ 13వసారి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుత ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ అయిన డుప్లాంటిస్ రెండో ప్రయత్నంలో 6.29 మీటర్ల ఎత్తుకు ఎగిరి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో గత జూన్‌లో 6.28 మీటర్లతో స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్ మీట్ సందర్భంగా నెలకొల్పిన ప్రపంచ రికార్డును డుప్లాంటిస్ సవరించాడు.

ఐదేళ్ల క్రితం పోలాండ్‌లో జరిగిన మీట్‌లో డుప్లాంటిస్ 6.17 మీటర్ల ఎత్తుకు ఎగిరి తొలిసారి ప్రపంచ రికార్డు సృష్టించాడు. 6.16 మీటర్లతో రెనాడ్ లావిలెని (ఫ్రాన్స్) పేరిట ఉన్న వరల్డ్ రికార్డును డుప్లాంటిస్ తిరగరాశాడు. అప్పటి నుంచి డుప్లాంటిస్ వెనుదిరిగి చూడలేదు. 2020లో రెండోసారి... 2022లో మూడుసార్లు... 2023లో రెండుసార్లు... 2024లో మూడుసార్లు... 2025లో మూడుసార్లు అతను ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు.

2020 టోక్యో ఒలింపిక్స్... 2024 పారిస్ ఒలింపిక్స్...2022 ప్రపంచ చాంపియన్‌షిప్, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో స్వర్ణ పతకాలు నెగ్గిన డుప్లాంటిస్ గత నాలుగేళ్లుగా డైమండ్ లీగ్‌లో విజేతగా నిలుస్తున్నాడు. 2022, 2024, 2025లలో జరిగిన ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ ఈ స్వీడన్ స్టార్ బంగారు పతకాలు గెలిచాడు.

పురుషుల, మహిళల పోల్‌వాల్ట్ విభాగాల్లో అత్యధికసార్లు ప్రపంచ రికార్డులు సృష్టించిన ఘనత సెర్గీ బుబ్కా (ఉక్రెయిన్), ఎలీనా ఇసిన్‌బయేవా (రష్యా)ల పేరిట ఉంది. వీరిద్దరూ 17 సార్లు చొప్పున ప్రపంచ రికార్డులు సృష్టించారు. ఇదే జోరు కొనసాగిస్తే డుప్లాంటిస్ ఏడాదిలోపు వీరిద్దరిని అధిగమించే అవకాశాలున్నాయి.

# 2030 కామన్వెల్త్ గేమ్స్ బిడ్‌కు ఐఓఏ ఆమోదం



**అవకాశం దక్కితే అన్నీ క్రీడాంశాల్లో పోటీలు**
**ఆర్చరీ, షూటింగ్, కబడ్డీ, ఖోఖోకు పెద్దపీట**

**న్యూఢిల్లీ:** 2030 కామన్వెల్త్ క్రీడలను స్వదేశంలో నిర్వహించేందుకు వేసిన బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన ఒలింపిక్ సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యులంతా మూకుమ్మడిగా బిడ్‌ను ఆమోదించారు.

చివరిసారిగా 2010లో కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యమివ్వగా... ఇరవై ఏళ్ల తర్వాత తిరిగి అవకాశం దక్కితే పూర్తి స్థాయిలో టోర్నమెంట్‌ను నిర్వహిస్తామని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష వెల్లడించారు.

2026లో గ్లాస్గో వేదికగా జరగనున్న కామన్వెల్త్ క్రీడల్లో హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, షూటింగ్ వంటి పలు క్రీడాంశాలను తొలగించారు. ఈ నేపథ్యంలో తదుపరి క్రీడలకు ఆతిథ్యమిచ్చే చాన్స్ వస్తే పూర్తి స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని ఉష పేర్కొన్నారు.

'సభ్యులంతా సమష్టిగా బిడ్‌కు ఆమోదం తెలపడం ఆనందం. అహ్మదాబాద్‌లో మాత్రమే క్రీడలు నిర్వహిస్తామని చెప్పలేదు. న్యూఢిల్లీ, భువనేశ్వర్‌లో కూడా మెరుగైన సదుపాయాలు ఉన్నాయి. 2026 గ్లాస్గో కామెన్వెల్త్ క్రీడల్లో పలు క్రీడాంశాలను తీసేశారు. 2030 ఆతిథ్య హక్కులు దక్కితే 2010లో మాదిరిగా అన్నీ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తాం' అని పీటీ ఉష తెలిపారు.

**ఐఓసీ ఫండ్‌పై సానుకూలత..**

జాతీయ క్రీడా సమాఖ్యల్లోని అనిశ్చితి నేపథ్యంలో... ఏడాది కాలంగా భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)కు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. గతేడాది అక్టోబర్ 8న జరిగిన ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం నుంచి నిధుల విడుదలను నిలిపివేశారు.

అయితే అంతర్గత విభేదాలు అధిగమించిన నేపథ్యంలో తిరిగి గ్రాంట్‌లు వస్తాయని భారత ఒలింపిక్ సంఘం ఆశిస్తోంది. బుధవారం ఐఓఏ ప్రత్యేక సర్వసభ్య సమావేశం, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ భేటీ సజావుగా సాగడంతో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నుంచి సానుకూల స్పందన వచ్చే అవకాశం ఉందని పీటీ ఉష ఆశిస్తున్నారు.

# ఆగస్టు 14.. క్రికెట్ గాడ్ 'సెంచరీ' శతకాల రికార్డుకు నాంది

**90's కిడ్స్‌కు అతడి పేరు ఓ ఎమోషన్. క్రీజ్‌లో ఉన్నాడంటే హమ్మయ్యా అంటూ ఊపిరిపీల్చుకొనేవారు. అదే ఔటయ్యాడని తెలిసిందా.. నిట్టూర్చేవారు. అంతా అయిపోయిందని టీవీ, రేడియోను కట్టేసేవాళ్లు. ఆ బ్యాటరే మాస్టర్ బ్లాస్టర్, క్రికెట్ గాడ్ సచిన్ తెందూల్కర్. ఆగస్టు 14 అతడి జీవితంలో గుర్తుండిపోయే రోజు. సరిగ్గా 35 ఏళ్ల కిందట '100' శతకాల రికార్డుకు ఆ రోజే పునాది పడింది.**



అంతర్జాతీయ క్రికెట్‌లోకి 16 ఏళ్ల వయసులో అడుగు పెట్టిన సచిన్ తెందూల్కర్ మొదటి సెంచరీ కోసం దాదాపు సంవత్సరం వేచి చూశాడు. 1990లో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టులో 119 పరుగులు సాధించాడు. మాంచెస్టర్ ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో శతకం చేయడం సాధారణ విషయం కాదు. టీనేజర్‌గా సచిన్ బాదిన ఆ సెంచరీ 'రికార్డు'లకు అంకురార్పణ అని ఎవరూ అంచనా వేయలేదు. దాదాపు రెండు దశాబ్దాలపాటు క్రికెట్ సామ్రాజ్యాన్ని ఏలిన సచిన్ చరిత్ర ఏంటో అందరికీ తెలిసిందే. కానీ, అతడు సాధించిన తొలి సెంచరీ మాత్రం ఎప్పటికీ నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే ఆ పరుగులు చేసే క్రమంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు.

**క్లిష్ట పరిస్థితుల్లో వచ్చి..**

సాధారణంగా సగం వికెట్లు పడ్డాయంటే టీమ్‌ఇండియా పని అయిపోయినట్లేనని ప్రత్యర్థి జట్లు భావించేవి. కానీ, అవన్నీ తప్పని నిరూపించిన మ్యాచ్ అది. ఎందుకంటే లోయర్‌తో కలిసి సచిన్ జట్టును ఓటమి నుంచి బయటపడేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 519 పరుగులు చేసింది. గ్రాహం గూచ్, మైక్ అథర్టన్, రాబిన్ స్మిత్ సెంచరీలు బాదారు. భారత్ అందుకు దీటుగానే స్పందించింది. హైదరాబాదీ బ్యాటర్ మహ్మద్ అజారుద్దీన్ (179), సంజయ్ మంజ్రేకర్ (93), సచిన్ (68) ఆదుకొన్నారు. దీంతో 432 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 87 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడిన ఇంగ్లాండ్ 320/4 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. అలెన్ లాంబ్ (109), మైక్ అథర్టన్ (74), రాబిన్ స్మిత్ (61) రాణించారు.

**ఇక్కడే అసలు కథ మొదలైంది.**

408 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ నవ్‌జ్యోత్ సిద్ధూ (0) డకౌట్ కాగా.. కాసేపటికే రవిశాస్త్రి (12) పెవిలియన్‌కు చేరాడు. అనంతరం సంజయ్ మంజ్రేకర్ (50), దిలీప్ వెంగసర్కార్ (32) కాస్త ఆదుకొనే ప్రయత్నం చేశారు. స్వల్ప వ్యవధిలో వారిద్దరితోపాటు అజారుద్దీన్ (11) ఔట్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. అప్పుడు బ్యాటింగ్‌కు వచ్చిన సచిన్ (119నాటౌట్: 189 బంతుల్లో) చివరి వరకు క్రీజ్‌లో నిలిచాడు. మాల్కోమ్, హెమ్మింగ్స్ వంటి డేంజరస్ బౌలర్లను ఎదుర్కొన్నాడు. అతడికి కపిల్ దేవ్ (26), మనోజ్ ప్రభాకర్ (67*) సహకారం అందించారు. చివరికి 6 వికెట్ల నష్టానికి 343 పరుగులు చేయడం గమనార్హం. ఇక ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్లు డ్రాకు అంగీకరించాయి.

**ఈ రికార్డు కష్టమే..**

ఇంగ్లాండ్‌పై టెస్టులో సెంచరీ బాదిన సచిన్.. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. 24 ఏళ్ల కెరీర్‌లో 664 మ్యాచులు ఆడి 34,357 పరుగులు చేశాడు. ఇందులో వంద శతకాలు, 164 అర్ధశతకాలు ఉన్నాయి. ఇప్పట్లో '100' సెంచరీల రికార్డును అధిగమించడం చాలా కష్టమే. విరాట్ కోహ్లీ (82) కేవలం వన్డేల్లోనే ఆడుతున్నాడు. కెరీర్‌లో 200 టెస్టుల్లో 15,921 పరుగులు, 463 వన్డేల్లో 18,426 పరుగులు, ఒకే ఒక్క అంతర్జాతీయ టీ20లో 10 పరుగులు చేశాడు. వంద శతకాల్లో.. టెస్టుల్లో 51, వన్డేల్లో 49 బాదాడు. టెస్టుల్లో అత్యధిక పరుగుల రికార్డు ఏమైనా చేజారొచ్చేమో కానీ..

# మా జట్టు మారిపోయింది.. గెలవాలనే లేదు: పాక్ టీమ్‌పై అక్తర్ అసహనం



వెస్టిండీస్ చేతిలో ఘోర ఓటమిని చవిచూసిన పాకిస్థాన్‌కు తమ మాజీ క్రికెటర్ల నుంచే విమర్శలు ఎదురయ్యాయి. కీలకమైన మూడో వన్డేలో 200+కిపైగా పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ డకౌట్ కాగా.. బాబర్ అజామ్ కేవలం 9 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. దీంతో 92 పరుగులకే పాక్ ఆలౌటైంది. ఈ క్రమంలో మాజీ స్టార్ పేసర్ షోయబ్ అక్తర్ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు.

''మా హయాంలో మేమంతా కలిసి కట్టుగా ఆడేవాళ్లం. టాలెంట్‌ను ప్రదర్శించాలని చూసేవాళ్లం. కేవలం ఒక్కరి మీదనే ఆధారపడేవాళ్లంకాదు. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అందించేవాళ్లు. ఎవరూ కూడా తప్పించుకోవడానికి మార్గాలను అన్వేషించలేదు. కానీ, ఇప్పుడు జట్టు వాతావరణం మారిపోయింది. గత 1015 ఏళ్లుగా ప్రతి ఒక్కరూ తమ స్వలాభం కోసమే ఆడుతున్నారు. వారి సగటును మెరుగుపర్చుకోవాలని మాత్రమే చూస్తున్నారు. దేశం కోసం మ్యాచ్‌లు గెలవాలనే సంకల్పం ప్రదర్శించాలి. ఇప్పటికైనా మీరు మారాలి. జట్టులో అలాంటి వాతావరణం కల్పించాలి. పరిస్థితులకు అనుగుణంగా నవతరం క్రికెట్‌ను ఆడాల్సి ఉంది. దీనిని అర్థం చేసుకోవడం అంత కష్టమా? విండీస్‌పై పాక్ బ్యాటర్లు ఆడిన తీరే పేలవంగా ఉంది. బంతి బాగా మూవ్ అవుతున్నప్పుడు ఆచితూచి ఆడాలి. మీరేమీ రావల్పిండి పిచ్ మీద ఆడటం లేదు. ప్రతిచోటుకీ ఆ పిచ్‌ను తీసుకెళ్లలేం'' అని వ్యాఖ్యానించాడు.

# రెండో స్థానానికి రోహిత్

**ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్**



**దుబాయ్:** ఐసీసీ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ రెండో స్థానానికి ఎగబాకాడు. 38 ఏళ్ల రోహిత్ 2025 ఐపీఎల్ సీజన్ తర్వాత మళ్లీ క్రికెట్ ఆడలేదు. రెండో స్థానంలోని బాబర్ అజామ్ వరుస వైఫల్యాలతో మూడో స్థానానికి పడటంతో.. రోహిత్ రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. శుభ్‌మన్ గిల్ నంబర్‌వన్ వన్డే బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లి నాలుగో ర్యాంకులో ఉన్నాడు. శ్రేయస్ 8, రాహుల్ 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో కుల్‌దీప్ యాదవ్ రెండో స్థానంలో నిలిచాడు. జడేజా 9వ స్థానంలో ఉన్నాడు. తీక్షణ (శ్రీలంక) నంబర్‌వన్ వన్డే బౌలర్‌గా కొనసాగుతున్నాడు. టీ20 బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్‌కు ఆరో ర్యాంకు దక్కింది. జైస్వాల్ 11వ స్థానంలో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి రవి బిష్ణోయ్ (7వ), అర్ష్‌దీప్ సింగ్ (9వ) టాప్ 10లో ఉన్నారు. డఫి (న్యూజిలాండ్) నంబర్‌వన్ టీ20 బౌలర్.*